ప్రతి నిత్యం తాజా వార్తలతో నిజాలు నిగ్గు తేలుస్తూ, సమకాలీన అంశాలను విశ్లేషిస్తూ ముస్తాబయి మీ ముందుకు వస్తున్న అక్షరం తెలుగు దినపత్రిక

సుఫల అక్షరం
తెలుగు దినపత్రిక సామాన్యుడి అస్త్రం

Your Ad Here.

ప్రకటనలకు (అడ్వర్టైస్‌మెంట్) కొరకు సంప్రదించండి

EDITOR & PUBLISHER: 9391690609, OFFICE: 7893003409.
aksharamtsnews@gmail.com .... www.aksharamtelugudaily.com

www.aksharamtelugudaily.com RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

WEDNUSDAY 08TH APRIL 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 09 ISSUE : 01 COST : 3\- KHAMMAM, TELANGANA

బుధవారం 08 ఏప్రిల్ 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 09 సంచిక : 01 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## ఎబిఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై దాడి

- ఇది ఫ్యాక్షన్ రాజకీయాలకు పరాకాష్ట
- తీవ్రంగా ఖండించిన చంద్రబాబు, లోకేశ్

అమరావతి,ఏప్రిల్7 హైదరాబాద్‌లో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై వైసీపీ దాడి యత్నాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్రంగా ఖండించారు. వైసీపీ నేతలు, రౌడీలు దాడికి దిగడం మీడియా స్వేచ్ఛపై దాడిగా సీఎం అభివర్ణించారు. సొంతంగా మీడియా


2వ పేజీలో..

# విజయన్, మోడీ మంచి మిత్రులు

- రాష్ట్ర యువతను మోసం చేస్తున్న పినరయ్
- కేరళంలో ఇక ఎల్‌డిఎఫ్‌కు కాలం చెల్లింది
- ప్రచారంలో సిఎం రేవంత్ రెడ్డి విమర్శలు



తిరువనంతపురం,ఏప్రిల్7 కేరళ ప్రజలను పినరయి విజయన్ మోసం చేస్తున్నారని కేరళ ఎన్నికల ప్రచారంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోమారు విమర్శలు గుప్పించారు. ఈ విషయంలో తాను చర్చకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పినరయి విజయన్.. మోదీ నుంచి సూచనలు తీసుకుంటున్నారు. వారి మధ్య ఒప్పందం ఉంది. కేసుల నుంచి మోదీ ఆయనను రక్షిస్తున్నారు. రాష్ట్రంలో యువతను విజయన్ మోసం చేస్తున్నారు. కేరళ ప్రజల నుంచి నాకు ఫీడ్‌బ్యాక్ వచ్చింది. విజయన్‌కు కేసీఆర్ మంచి మిత్రుడు. కేసీఆర్ పాలన గురించి విజయన్ ప్రస్తావించారని రేవంత్ అన్నారు. కేరళం యువత హార్డ్ వర్కింగ్ పీపుల్ అని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. తాజాగా కేరళం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సీఎం రేవంత్ అక్కడి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. గల్ఫ్ దేశాల అభివృద్ధిలో కేరళం యువత పాత్ర కీలకమన్నారు. కేరళంలోనే విషాద స్టోరీలకు యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ ప్రభుత్వం చరమాంకం పలుకుందన్నారు. యూడీఎఫ్ గవర్నమెంట్ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పినరయి విజయన్ అంటే తనకు గౌరవమని.. కానీ ఆయన ప్రభుత్వం అంటే తనకు నచ్చదన్నారు. ఊమెన్ చాండీ కరుణాకరన్ ఆధ్వర్యంలో కేరళ అభివృద్ధి చెందిందన్నారు. కేరళంకు పినరయి విజయన్, మోడీలు వద్దు. పినరయి విజయన్ జ్యోతి బసు, సోమనాథ్ చటర్జీలను మరచిపోయి చాలా కాలం అయ్యింది. ఎన్డీఏ తరపున పినరయి విజయన్ కేరళంలో పని చేస్తున్నారు. కేరళంలో ప్రతి సమస్యకు కారణం పినరయి విజయన్. గత పదేళ్లుగా పినరయి విజయన్ కాకుండా మరో వామపక్ష నేత లీడర్‌గా లేరు. 2023కు ముందు తెలంగాణను తాను తప్ప ఎవరు నడిపించ లేరు అని పినరయి విజయన్ స్నేహితుడు కేసీఆర్ అనుకున్నారు. కానీ కాంగ్రెస్ వచ్చి తెలంగాణలో అభివృద్ధి చేస్తోంది. కేరళంలో యూడీఎఫ్ వచ్చి పినరయి విజయన్ కోటను బద్దలు కొడుతుంది. మోడీ పినరయి విజయన్ పేరుతో కేరళంలోకి ఎంటర్ అవుతున్నారు. మోడీ, పినరయి విజయన్ ఇద్దరూ బ్రదర్స్. కేరళంలో పినరయి, ఢిల్లలో మోడీ మంచి మిత్రులని సీఎం రేవంత్ విమర్శలు గుప్పించారు.



## ఇరాన్ నాగరికత అంతమై పోవడం ఖాయం

- ఇష్టం లేకపోయినా చర్యలు తప్పడం లేదు
- హర్మూజ్‌ను తెరవకపోతే విధ్వంసం తప్పదు
- మరోమారు ఘాటుగా హెచ్చరించిన ట్రంప్

వాషింగ్టన్,ఏప్రిల్7 అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇరాన్ నాగరికత

మిగతా 2వ పేజీలో..

## యూరియాను శాస్త్రీయంగా వాడాలి

- యూరియా యాప్‌పై హర్షం వ్యక్తం చేసిన రైతులు
- అధిక వాడకం వల్ల భూసారం తగ్గిపోతుంది
- మంత్రి తుమ్మల



హైదరాబాద్,ఏప్రిల్7: దేశంలోనే అధికంగా యూరియా వాడుతున్న రాష్ట్రాలలో తెలంగాణ కూడా ఉందని, ఇది ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతులు యూరియాను అధికంగా వినియోగించవద్దని కోరారు. యూరియాను అధికంగా వాడటం వల్ల, నేల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు, రానురాను దిగుబడులు కూడా తగ్గుతాయని, చీడ పీడల సమస్యలు పెరుగుతాయని తెలిపారు. ఇప్పుడు పంటల కోతల సమయం వచ్చిందని, రైతులు కోతల అనంతరం వచ్చే పంట వ్యర్థాలను కాల్చవద్దని అన్నారు. పంట వ్యర్థాలను కాల్చడం ద్వారా పర్యావరణం దెబ్బతింటుందని తెలిపారు. ప్రతి మంగళవారం

మిగతా 2వ పేజీలో..

## గడువుకు ముందే దాడులు

- ఖర్గ్ ద్వీపంపై బాంబులు
- చూస్తూ ఊరుకోమని ఇరాన్ హెచ్చరిక

వాషింగ్టన్,ఏప్రిల్7 పశ్చిమాసియాలో పరిస్థితులు మరింత చేదాటుతున్నాయి. ట్రంప్ హెచ్చరించినట్లుగానే గడువుకు ముందే ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ భీకర దాడులు చేపట్టాయి. విద్యుత్ ప్లాంట్లు, బ్రిడ్జులు లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయి. ఇరాన్‌లోని ఖర్గ్ ద్వీపంపై కూడా అమెరికా క్షిపణి దాడులు చేసింది. అలాగే కరాజ్ నగరంలో విద్యుత్ ప్లాంట్‌పై దాడి చేయగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చమురు కేంద్రమైన ఖార్గ్ ద్వీపాన్ని లక్ష్యంగా చేసుకుని పలు దాడులు జరిగాయని ఇరాన్‌కు చెందిన మెహర్ న్యూస్ పేర్కొంది. ఇక ఇరాన్‌లో రైల్వే సర్వీసులు కూడా నిలిచిపోయాయి. ఇరానీయులు రైళ్ల ప్రయాణాలకు దూరంగా ఉండాలని ఇజ్రాయెల్ హెచ్చరించింది. అంటే రైళ్లను ఇజ్రాయెల్ టా÷-గ్గ÷ట్ చేసుకుందన్న హెచ్చరికల నేపథ్యంలో ఇరాన్ ముందుగా స్టేషన్లు, రైలు సర్వీసులను నిలిపివేసింది. ఫిబ్రవరి 28 నుంచి పశ్చిమాసియా యుద్ధం జరుగుతోంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా దాడి చేశాయి. ఈ ఘటనలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ

మిగతా 2వ పేజీలో..



## వచ్చే మూడ్రోజులు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు

**పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం**

హైదరాబాద్,ఏప్రిల్7 తెలుగు రాష్ట్రల్లో వచ్చే మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. తాజా వివరాల ప్రకారం.. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే

మిగతా 2వ పేజీలో..

## కాంగ్రెస్ కోసం సైనికుల్లా పనిచేయాలి

- బిఆర్ఎస్, బిజెపిలకు అధికారం కల్ల
- నాగర్ కర్నూలులో పిసిసి చీఫ్




నాగర్ కర్నూల్,ఏప్రిల్7 తెలంగాణలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే సైనికుల్లా పని చేయాలని పార్టీ కార్యకర్తలకు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీలు అధికారంలోకి రావని ఆయన జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కావాలని బావా బామ్మర్దులు హరీశ్ రావు, కేటీఆర్ కొట్లాడుకుంటున్నారని విమర్శించారు. మంగళవారం నాగర్ కర్నూల్‌లో కొత్తగా ఏర్పాటైన జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పేదలకు చేసింది ఏమి లేదన్నారు. అలాంటి పార్టీ రాష్ట్రంలో ఎలా అధికారంలోకి వస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ గుండెకాయ గ్రామాల్లో ఉందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. గ్రామాల్లోకి వెళ్లి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయండంటూ కేడర్‌కు ఈ సందర్భంగా ఆయన సూచించారు. కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా పని చేసే కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి

మిగతా 2వ పేజీలో..



## అడ్డదారుల్లో ధాన్యాన్ని తరలిస్తే ఉపేక్షించం

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరిక**

సూర్యాపేట,ఏప్రిల్7 అడ్డదారుల్లో ధాన్యాన్ని తరలిస్తే ఉపేక్షించేది లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. రాష్ట్ర సరిహద్దుల్లో ధాన్యం ఎగుమతులు, దిగుమతులపై కట్టుదిట్టమైన నిఘా ఉంచామని స్పష్టం చేశారు. ఈ రబీ సీజన్‌లో 148 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి ఉందని తెలిపారు. 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం

మిగతా 2వ పేజీలో..

# ఎబిఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై దాడి

➢ మొదటి పేజి తరువాయి

సంస్థలను నడుపుతూ.. మీడియాను అడ్డుపెట్టుకుని అనైతిక చర్యలకు పాల్పడుతోన్న వైసీపీ.. తమను ప్రశ్నించిన ఆంధ్రజ్యోతిపై ఆరోపణలు, దూషణలు చేయడం అసంబద్ధం అన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో మీడియా సంస్థలపై, ఆంధ్రజ్యోతిపై అనేక వేధింపులకు, కుట్రలకు పాల్పడినా నిబ్బరంగా నిలిచాయి తప్ప భయపడలేదని చంద్రబాబు గుర్తుచేశారు. రౌడీ మూకలను వెంటేసుకుని స్వయంగా ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు మీడియా కార్యాలయంపైకి వెళ్లడం వైసీపీ రౌడీ సంస్కృతికి నిదర్శనమని ఈ సందర్భంగా చంద్రబాబు వ్యాఖ్యానించారు. వేమూరి రాధాకృష్ణ దశాబ్దాలుగా కేసులు, దాడులు, ఒత్తిళ్లకు భయపడ కుండా పత్రికను, ఛానల్‌ను నడుపుతున్నారన్నారు. దాడులు, నిరసనలు, బెదిరింపులతో మీడియాను భయపెట్టాలనే వైసీపీ రాజకీయాలకు కాలం చెల్లిందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అధికారంలో ఉండగా మహిళల పట్ల, సొంత కుటుంబ సభ్యుల పట్ల వైసీపీ నాయకులు, ఆ పార్టీ అధ్యక్షుడు వ్యవహరించిన తీరును మహిళా సమాజం ఎప్పటికీ మర్చిపోదన్నారు. రాజధానిపై వైసీపీ కుట్రలను ప్రశ్నించిన ఆంధ్రజ్యోతి సంపాదకీయానికి సమాధానం చెప్పలేక.. దాడులు నిరసనలతో వైసీపీ డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని సీఎం చంద్రబాబు దుయ్యబట్టారు. ఈ దాడులను విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా ఖండించారు. ఫ్యాక్షన్ బెదిరింపులకు రాధాకృష్ణ భయపడే వ్యక్తి కాదని లోకేశ్ అన్నారు.

'జగన్ కళ్లలో ఆనందం చూడటం కోసం వైసీపీ రౌడీ మూకలు ఆంధ్రజ్యోతి కార్యాలయంపై దాడికి ప్రయత్నించడం ఆ పార్టీ విష సంస్కృతిని మరోసారి బయటపెట్టింది. నిజాన్ని నిర్భయంగా చెప్పగలిగే దమ్మున్న ఛానల్ ఏబీఎన్-ఆంధ్రజ్యోతిపై వైసీపీ దాడి యత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. సాక్షి హైదరాబాద్ ఆఫీస్‌కు ఆంధ్రజ్యోతి ఎంత దూరమో.. ఆంధ్రజ్యోతికి సాక్షి కూడా అంతే దూరంలో ఉంది అన్న సంగతి మర్చిపోవద్దు జగన్. మీడియా కథనాల పట్ల నిరసనలు తెలియజేసే పద్ధతి ఇది కాదు' అని లోకేశ్ అన్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభం అయిన మీడియా ప్రశ్నిస్తే జవాబు చెప్పాలి. కథనం ప్రచురిస్తే ఆధారాలతో ఖండించాలి. కథనం ప్రసారం చేస్తే తప్పయితే తప్పని చెప్పగలగాలి. ఇవేవీ మీ దగ్గర లేనప్పుడు ఇలాంటి దుర్మార్గపు దాడులకు తెగబడటం అలవాటుగా మార్చుకున్నారని మండిపడ్డారు..

## కాంగ్రెస్ కోసం సైనికుల్లా పనిచేయాలి



➢ మొదటి పేజి తరువాయి

పని చేయాలని కేడర్‌కు స్పష్టం చేశారు. పార్టీలో అందరికీ అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. అలాగే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి.. లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలన్నారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కేంద్రాన్ని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ.. తన పాదయాత్రలో అన్ని విషయాలను తెలుసుకున్నారని వివరించారు. అందుకే స్థానిక ఎన్నికల్లో బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు ఇచ్చామని పీసీసీ చీఫ్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి రేషన్ కార్డు మంజూరు చేశామని టీ పీసీసీ చీఫ్ చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ళు, సన్న బియ్యం, ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే చెందుతుందన్నారు. పార్టీ అగ్రనేత సోనియాగాంధీ ఇచ్చిన మాట ప్రకారం.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇచ్చారని గుర్తు చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ వచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలలో ఎన్ని నిధులు ఇచ్చారు? ఎన్ని నియామకాలు చేశారు? అంటూ ఆ పార్టీ నేతలకు టీ పీసీసీ చీఫ్ సూటిగా ప్రశ్నలు సంధించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 8 లక్షల కోట్లు అప్పులు చేసి పోయిందని.. ఆ అప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం తీర్చుస్తుందని ఆయన తెలిపారు. ఇచ్చిన హామీలను సైతం కాంగ్రెస్ పార్టీ నెరవేర్చుకుంటూ ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు రాజేశ్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సావర్కర్, కార్యదర్శి వంశీ చంద్ రెడ్డితోపాటు పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అడ్డదారుల్లో ధాన్యాన్ని తరలిస్తే ఉపేక్షించం

కొనుగోలుకు తమ ప్రభుత్వం సన్నద్ధమైందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 8,251 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. అందుబాటులో 16 కోట్ల గన్నీ బ్యాగులు ఉన్నాయని తెలిపారు. అంతకుముందు హుజూర్ నగర్ రామస్వామి గట్టు సమీపంలో ఐటీ కాలేజీతో పాటు మోడల్ కాలనీ పనులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలో 116 ఎకరాల్లో నిర్మిస్తున్న 2,160 సింగిల్ బెడ్‌రూమ్ ఇళ్ల మోడల్ కాలనీ రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తాయని చెప్పుకొచ్చారు. కాలనీ నిర్మాణానికి రూ.125 కోట్లు ఖర్చు, అదనంగా రూ.20 కోట్లు మంజూరయ్యాయని వెల్లడించారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని, ఎలాంటి పైరవీలకు అవకాశం ఉండదని స్పష్టం చేశారు. జాబితాలో ఎవరైనా అనర్హులు ఉంటే నేరుగా ఫిర్యాదు చేయాలని సూచించారు. మొదటి విడతలో 1500 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఏప్రిల్ నెలాఖరులో మోడల్ కాలనీ ప్రారంభోత్సవం జరుగుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# ఇరాన్ నాగరికత అంతమై పోవడం ఖాయం

➢ మొదటి పేజి తరువాయి

మొత్తం నేటి రాత్రితో అంతమైపోతుందని అన్నారు. దానిని మళ్లీ ఎప్పటికీ పునరుద్ధరించలేరని 'ట్రూత్ సోషల్' వేదికగా పోస్టు పెట్టారు. ఇరాన్‌లో 47 ఏళ్లుగా ఉన్న అవినీతి, అరాచక పాలన అంతం కానుందని.. ప్రపంచ చరిత్రలో ఈ రాత్రి ఓ మైలురాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఆ దేశాన్ని తుడిచిపెట్టడం నిజానికి తనకు ఇష్టం లేదని.. కానీ ఆ విధంగా చేయక తప్పట్లేదని పేర్కొన్నారు. అయితే, ఇరాన్‌లో కొత్త, తెలివైన నాయకత్వం వచ్చిందని, దాని వల్ల అద్భుతాలు జరిగే అవకాశం కూడా ఉందన్నారు.మరికొన్ని గంటల్లో ఇరాన్ హర్మూజ్‌ను తెరవకపోతే ఆ దేశంలోని ఇరాన్‌లో వంతెనలు, విద్యుత్ కేంద్రాలను లక్ష్యం చేసుకుంటామని సోమవారం ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ అమెరికా ప్రతిపాదనలను ఇరాన్ తిరస్కరించడంతో.. ట్రంప్ తాజాగా మరోసారి హెచ్చరికలు చేశారు. ఇరాన్‌లోని పౌర, మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తే.. అంతర్జాతీయ నేరంగా పరిగణిస్తామని ఐక్యరాజ్య సమితి చీఫ్ ఆంటోనియో గుటెరస్ హెచ్చరించినప్పటికీ అమెరికా దాడులు కొనసాగిస్తోంది.ఇరాన్‌లోని ఖర్గ్ ఐలాండ్ లో ఉన్న దాదాపు 50 లక్ష్యాలపై తమ దళాలు దాడులు జరిపినట్లు అమెరికా వెల్లడించింది. అక్కడి రక్షణ వ్యవస్థలపై కూడా దాడులు చేసినట్లు తెలిపింది. ఈ ద్వీపాన్ని స్వాధీనం చేసుకోవడానికి మెరైన్‌లతో ఆపరేషన్ చేపట్టడానికి అగ్రరాజ్యం యోచిస్తున్నట్లు సమాచారం. ఇరాన్‌లోని పలు ప్రాంతాల్లోనూ అమెరికా-ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ స్పందించింది. ఈ రాత్రికి ఇరాన్ నాగరికత తుడిచి పెట్టుకోబోతోందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను తిప్పికొట్టింది. అమెరికా, దాని మిత్రదేశాలే పురాతన నాగరికత కలిగిన ఇరాన్ నుంచి మరిచిపోలేని దెబ్బను రుచి చూస్తారంటూ పేర్కొంది. ఈ మేరకు దక్షిణ ఆఫ్రికాలోని ఇరాన్ ఎంబసీ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టింది.

# యూరియాను శాస్త్రీయంగా వాడాలి

➢ మొదటి పేజి తరువాయి

నిర్వహించే రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా.. ఈ రోజు నిర్వహించి రైతునేస్తం కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి సచివాలయం నుండి హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో ముఖాముఖి మాట్లాడిన మంత్రిగారు.. యూరియా యాప్ మరియు యూరియా వినియోగం వంటి అంశాలపై రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతునేస్తం కార్యక్రమంలో రైతులు అధికంగా పాల్గొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు, రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. యూరియా యాప్ పై రైతుల అభిప్రాయాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. యూరియా యాప్ తో లైన్లలో నిలబడే బాధ తప్పిందని, ఇంట్లో నుంచే యూరియాను బుక్ చేసుకోని, ఉచిత సమయంలో తెచ్చుకునేందుకు వీలు కలిగిందని, దీంతో సమయం వృథా కాకుండా ఉందని రైతులు యూరియా యాప్ ని కొనియాడారు. భవిష్యత్తులో కూడా యూరియా యాప్ తోనే యూరియా అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని మంత్రిగారిని రైతులు కోరారు. రైతుల అభిప్రాయాలను పరిగణలోనికి తీసుకొని, రైతుల అభిప్రాయాల మేరకే ఈ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని మంత్రిగారు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అధిక యూరియా వాడకం ద్వారా వచ్చే అనర్థాలను రైతులకు మంత్రి వివరించారు. రైతులు తాము పండించే అన్ని పంటలలో పామాయిల్ పంటను కూడా వేయవచ్చని, పామాయిల్ పంటను వేసి కూడా వరి, పత్తి, మొక్కజొన్న లాంటి పంటలు పండించుకోవచ్చని రైతులకు వివరించారు. రైతులందరు పామాయిల్ పంటను వేసినట్లయితే స్థిరమైన అధిక ఆదాయం పొందే వీలుంటుందని అన్నారు. సచివాలయంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్మన్ మరియు కౌన్సిలర్లు, సర్పంచ్ లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుగారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా హుజురాబాద్ ప్రతిపాదించిన డంపింగ్ యార్డు పనులను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఒడితల ప్రణవ్ పాల్గొన్నారు.

## రేవంత్ సవాల్‌ను తిప్పికొట్టిన పినరయ్

### తెలంగాణలో మా పార్టీ వారు చూసుకుంటారని ఎద్దేవా

తిరువనంతపురం,ఏప్రిల్7 తనతో చర్చకు రావాలన్న సీఎం రేవంత్‌రెడ్డి సవాల్‌పై కేరళం ముఖ్యమంత్రి పినరయి విజయన్ తిప్పికొట్టారు. ఆయనతో చర్చకు దిగే ఉద్దేశం తనకు లేదన్నారు. రేవంత్‌తో చర్చకు దిగేందుకు తెలంగాణలో పార్టీలు ఉన్నాయని, ఆయన ప్రభుత్వ పనితీరుపై అక్కడి ప్రజలే తీర్పునివ్వాలని వ్యాఖ్యానించారు. తమ పార్టీ నేతలు అక్కడ రేవంత్ వ్యవహారంపై మాట్లాడుతారని అన్నారు. నీతి ఆయోగ్ 2023-24 సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సూచీలో కేరళ తొలి స్థానంలో ఉందని పినరయి విజయన్ అంటున్నారని, ఇది కేరళలో ఏడు దశాబ్దాల ప్రభుత్వాలన్నింటి కృషి అని సోమవారం సీఎం రేవంత్ పేర్కొన్న సంగతి తెలిసిందే. అందులో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూడా ఉందని గుర్తించాలన్నారు. అందరి కష్టాన్నీ సొంత ఖాతాలో వేసుకోవడం సరికాదని హితవు పలికారు. ఈ అంశంపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నానని, చర్చకు రావాలని పినరయి విజయన్‌కు సవాల్ విసిరారు. తెలంగాణ ప్రభుత్వ పనితీరును విమర్శిస్తూ కేరళ సీఎం పినరయి విజయన్ రాసిన లేఖపై సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి స్పందించారు. కేరళ ప్రభుత్వ పనితీరుపై తన విమర్శలను ఎంతో గౌరవప్రదంగా, హుందాగా వ్యక్తం చేశానని అన్నారు. విజయన్ మాత్రం తక్కువ స్థాయి భాషను ఉపయోగించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ' మీ అసహనపూరిత వ్యాఖ్యలకు నేను అదే రీతిలో స్పందించను. మీరు నా రాష్ట్రానికి వచ్చినప్పుడు, ఒక అతిథికి చేయాల్సిన అన్ని మర్యాదలు చేస్తానని మాట ఇస్తున్నా. ప్రస్తుత తెలంగాణ పరిస్థితికి మీరు నీతి ఆయోగ్ ఎస్డీజీ ఇండెక్స్ 2023-24ని ప్రామాణికంగా చూపిస్తున్నారు. ఆ సూచీ డిసెంబర్ 2023తో ముగిసిన బీఆర్ఎస్ పదేళ్ల దుష్పరిపాలనను ప్రతిబింబిస్తుంది. మా ప్రభుత్వం 28 నెలలు పూర్తి చేసుకుంది. 2024-25లో తెలంగాణ జీఎస్డీపీ రూ.16.12 లక్షల కోట్లుగా ఉండి.. 10.7 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది జాతీయ సగటు 9.9 శాతం కంటే ఎక్కువ. కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, కేరళలను అధిగమించి భారత్‌లోనే అత్యధిక తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. కేరళ ప్రజలకు మీ హయాంలో ఏం జరిగిందో చూపించండి' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

# గడువుకు ముందే దాడులు

➢ మొదటి పేజి తరువాయి

హతమయ్యారు. అంతేకాకుండా పలువురు కీలక నేతలు కూడా చనిపోయారు. అప్పటి నుంచి ఇరాన్ కూడా ప్రతీకార దాడులతో చెలరేగిపోయింది. గల్ఫ్ దేశాలు లక్ష్యంగా క్షిపణులు ప్రయోగించింది. అంతేకాకుండా హార్మూజ్ జలసంధిని మూసేసింది. దీంతో ప్రపంచ దేశాల్లో చమురు, గ్యాస్ సంక్షోభం తలెత్తింది.అయితే హార్మూజ్ జలసంధిని తెరవాలని ట్రంప్ డెడ్‌లైన్ విధించారు. ఒప్పందం చేసుకోకపోతే 48 గంటల్లో ఇరాన్‌ను సర్వ నాశనం చేస్తామని ట్రంప్ బెదిరించారు. అయితే ఒప్పందం చేసుకునేందుకు ఇరాన్ ససేమిరా అంది. ఎట్టి పరిస్థితుల్లో ఒప్పందం చేసుకోబోమని తేల్చి చెప్పింది. తాజాగా ఒప్పందం రద్దు కావడంతో డెడ్‌లైన్‌కు ముందుగానే అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా భీకర దాడులు చేస్తున్నాయి. దీంతో పరిస్థితులు తీవ్ర ఉద్రిక్తంగా మారాయి. ఇరాన్ ఆర్థిక కిరీటమైన ఖర్గ్ ఐలాండ్ పై మరోసారి దాడులు జరిగాయని స్థానిక మీడియా వెల్లడించింది. హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరిచేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు విధించిన గడువుకు కొన్ని గంటలే మిగిలి ఉన్నవేళ ఖర్గ్‌తో పాటు ఆ దేశంలోని రహదారులు, రైల్వే వంతెనలపై భారీ దాడులు చోటుచేసుకున్నాయి. ద్వీపంలోని మిలిటరీ టా÷-గ్గ÷ట్లపైనా అమెరికా-ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించాయి. మార్చినెలలో కూడా అమెరికా ఓసారి ఈ ప్రాంతంలో దాడులు చేసింది. తాజా దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్-అమెరికాకు ఇరాన్ హెచ్చరికలు చేసింది. ఇన్నాళ్లు యుద్ధం ముగింపు గురించి ఓపికతో ఎదురు చూశామని..ఇక తమ సహనం నశించిందని ఐఆర్‌జీసీ పేర్కొంది. అమెరికా, ఇజ్రాయెల్ సహా వాటి మిత్ర దేశాలపై దాడులు చేస్తామని వెల్లడించింది. ఆయా దేశాలలోని మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటామని..చమురు, గ్యాస్ సరఫరాలకు ఏళ్ల తరబడి అంతరాయం కలిగిస్తామని హెచ్చరించింది.

# వచ్చే మూడ్రోజులు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు

➢ మొదటి పేజి తరువాయి

అవకాశం ఉంది. ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర ప్రాంతాల్లో మేఘావృత వాతావరణంతో పాటు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. ఇక తెలంగాణలోనూ పలు జిల్లాల్లో వర్షాలు పడనున్నాయి. భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉండగా, సూర్యపేట, వరంగల్, జనగామ, సిద్ధిపేట జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. పిడుగులు పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉరుములు, మెరుపులు ఉన్న సమయంలో బహిరంగ ప్రదేశాల్లో తిరగకూడదని సూచించారు. రైతులు, ప్రయాణికులు సైతం వాతావరణ పరిస్థితులను గమనించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు.

పిడుగులు తాటి చెట్లు, విద్యుత్ స్తంభాల మీద ఎకువగా పడుతుంటాయి. కాబట్టి వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ తీగల కింద, ట్రాన్స్ ఫార్మర్ సమీపంలో ఉండకూడదు. ఒక్కోసారి పిడుగు పడ్డ ప్రదేశంలోనే మరోసారి పడే అవకాశం ఉంటుంది. కాబట్టి ఆ ప్రాంతానికి వెళ్లకూడదు. వర్ష సూచన ఉన్నప్పుడు గొడుగులపై ఇనుప బోర్డులు, కెమెరాలు, సెల్‌ఫోన్లు దగ్గర ఉంచుకోక పోవడం చాలా మంచిది. పశువులను గుడిసెలు, కొట్టాలు, షెడ్లలో కట్టివేయాలి. చెట్ల కింద ఉంచొద్దు. ఉరుములు, మెరుపులతో వర్షం పడినప్పుడు రైతులు పొలాల వద్ద ఉండకూడదు.

# తెలంగాణలో మావోయిస్టుల శకం ముగిసింది

**కర్రెగట్టుల్లో స్వేచ్ఛగా తిరిగే వెసలుబాటు**

**మావోయిస్టు అడ్డాలో అభివృద్ధి పరుగులు**

**రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడి**

ములుగు,ఏప్రిల్7 తెలంగాణలో మావోయిస్టుల శకం ముగిసిందని డిజిపి శివధర్ రెడ్డి అన్నారు. ఒకప్పుడు తుపాకుల మోతతో, అశాంతితో నిండిన తెలంగాణ అటవీ ప్రాంతాల్లో ఇప్పుడు శాంతి గీతం వినిపిస్తోంది. దశాబ్దాల కాలంగా మావోయిస్టులకు అడ్డాగా ఉన్న ప్రాంతాల్లో ఇప్పుడు అభివృద్ధి పరుగులు తీస్తోంది. తెలంగాణలో మావోయిజం పూర్తిగా అంతరించిందని రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి అధికారికంగా ప్రకటించారు. 'ఫేస్ టు ఫేస్' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, కర్రెగుట్టల వంటి మారుమూల ప్రాంతాల్లో మారుతున్న పరిస్థితులను వివరించారు. ఒకప్పుడు దట్టమైన అడవుల్లో సమాంతర ప్రభుత్వాన్ని నడిపిన మావోయిస్టుల ఉనికి ఇప్పుడు తెలంగాణలో లేదని డీజీపీ స్పష్టం చేశారు. ఆపరేషన్ కగార్ విజయవంతం కావడంతో పాటు, కీలక నాయకత్వం , సైన్యాధ్యక్షులు సైతం బయటకు రావడంతో ఆ వ్యవస్థ పూర్తిగా కొలాప్స్ అయిందని ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు ఈ ప్రాంతాలు నక్సల్ రహిత జోన్లుగా మారాయని, ప్రజలు స్వేచ్ఛగా తిరుగుతున్నారని తెలిపారు. గతంలో కనీస సౌకర్యాలు లేకపోవడమే నక్సలిజం పెరగడానికి ప్రధాన కారణమని గుర్తించిన ప్రభుత్వం, ఇప్పుడు ఆ లోటును భర్తీ చేస్తోంది. బాహ్య ప్రపంచంతో సంబంధం లేని కర్రెగుట్టల వంటి ప్రాంతాలకు ఇప్పుడు బిటి రోడ్ల నిర్మాణం జరుగుతోంది. దీనివల్ల ఆదివాసీలకు రవాణా సౌకర్యం మెరుగుపడింది. అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి వెళ్లడానికి గ్రామస్తుల కోసం ప్రభుత్వం ఒక ఆటో , టూ వీలర్‌ను కమ్యూనిటీ వాహనాలుగా అందజేసింది. గతంలో 12-13 కిలోమీటర్లు కాలినడకన వెళ్లాల్సిన దుస్థితి ఇప్పుడు తొలగిపోయింది. ఇప్పటికీ విద్యుత్ సౌకర్యం లేని మారుమూల ఇళ్లకు సోలార్ కందిళ్లను పంపిణీ చేయడం ద్వారా ప్రభుత్వం చీకట్లను తొలగిస్తోంది. కనీసం ఆధార్ కార్డులు, ఓటు హక్కు వంటి కనీస గుర్తింపు కూడా లేని ఆదివాసీలకు ఇప్పుడు అన్ని ప్రభుత్వ ఫలాలను అందించడమే లక్ష్యంగా పోలీస్ బాస్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దే అవకాశం ఉందని, అటవీ వనరులను కాపాడుకుంటూనే అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామని డీజీపీ భరోసా ఇచ్చారు. తుపాకీ గొట్టం ద్వారా కాకుండా, అభివృద్ధి ద్వారానే మార్పు సాధ్యమని తెలంగాణ ప్రభుత్వం నిరూపిస్తోంది. కర్రెగుట్టల వంటి ప్రాంతాల్లో వేసిన రోడ్లు కేవలం రవాణా కోసమే కాదు, ఆ ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం వేసిన బాటలు అని చెప్పవచ్చన్నారు.

## ఆంధ్రజ్యోతి కథనాలు సరికాదు

నేడు వాటి కార్యాలయాల ముందు నిరసనలు

ఏపీ శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స

విశాఖపట్నం,ఏప్రిల్7 ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంస్థల ఎండీ వేమూరి రాధాకృష్ణ వార్తా వ్యాఖ్యలను తాము ఖండిస్తున్నామని ఏపీ శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. ఎవరైనా విమర్శ చేస్తే విధాన పరంగా ఉండాలన్నారు. ఇందుకు నిరసనగా బుధవారం ఏపీలోని అన్ని జిల్లాల్లో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమం చేపడతామని స్పష్టం చేశారు. మంగళవారం విశాఖపట్నంలోని వైసీపీ కార్యాలయంలో బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు కలిపి మావిగాన్ అని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చెప్పారని అన్నారు.

# మహిళల భద్రతే జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యం

## గుండెపోటుతో నిడిగొండ ఉప సర్పంచ్ లక్ష్మారెడ్డి మృతి

- నివాళులర్పించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి





జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్)ఏప్రిల్ 07: మండలంలోని నిడిగొండ ఉప సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గంగిడి లక్ష్మా రెడ్డి (53) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. లక్ష్మారెడ్డి మృతితో నిడిగొండ గ్రామంలో విషాదం నెలకుంది. 22 డిసెంబరు 2025న నిడిగొండ ఉప సర్పంచ్ గా లక్ష్మారెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. ఉప సర్పంచ్ గా బాధ్యతలు చేపట్టి మూడున్నర నెలలు కూడా గడవక ముందే లక్ష్మారెడ్డి గుండెపోటుతో మృతి చెందడం పట్ల మండల కాంగ్రెస్ నాయకులతో పాటు నిడిగొండ గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తున్నారు. లక్ష్మారెడ్డికి భార్య పావని, కుమారుడు శివశంకర వరప్రసాద రెడ్డి, కుమార్తె వర్షిణి ఉన్నారు. లక్ష్మారెడ్డి పార్థివ దేహానికి స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరిమాట్లాడుతూ అందరికి తలలో నాల్కల ఉండే సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గంగిడి లక్ష్మారెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని అన్నారు. అనంతరం లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో నిడిగొండ సర్పంచ్ బొమ్మ వీరస్వామి, మాసాన్ పల్లి లింగాజీ, గొట్టం భాస్కర్ రెడ్డి, గంగిడి నర్సింహా రెడ్డి, మేకల నరేందర్, గాదె మహేందర్ రెడ్డి. కోళ్ల రవి, గొట్టం కరుణాకర్ రెడ్డి, కొలిపాక రాజు, లింగాల వెంకట రెడ్డి, మహ్మద్ అబ్బాస్ మియా, బిర్రు నర్సింహులు, ఇబ్రహీం పాష. మైలారం అంజనేయులు, పేర్నె రవి తదితరులు పాల్గొన్నారు

## కామారంసబ్ సెంటర్ కు రాష్ట్ర సాయి అవార్డు... సిబ్బంది

- కృషి ని మెచ్చిన మంత్రి లి మాతృశిశుఆరోగ్య సేవల్లో విశిష్ట పనితీరు కనబర్చిన కామారంసబ్ సెంటర్ కు రాష్ట్ర సాయి అవార్డు ను సోంతంచ చేసుకుంది








మహబూబాబాద్ జిల్లా/ గంగారం/ ఏప్రిల్ 7() (అక్షరం న్యూస్ )

మాతృ-శిశు ఆరోగ్య సేవల్లో విశిష్ట పనితీరు కనబర్చిన కామారం సబ్ సెంటర్ రాష్ట్ర స్థాయి అవార్డును సొంతం చేసుకుంది. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలంలోని కోమట్ల గూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పనిచేస్తున్న సబ్ సెంటర్‌కు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా చొంగ్తే చేతుల మీదుగా పురస్కారం ప్రదానం చేయడం జరిగింది.గర్భిణీ స్త్రీల ముందస్తు నమోదు, నాలుగు తప్పనిసరి ఏఎన్సి పరీక్షలు, పూర్తి రోగ నిరోధక టీకాల అమలులో అత్యుత్తమ ఫలితాలు సాధించడం ద్వారా కామారం సబ్ సెంటర్ రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందింది.గ్రామీణ ప్రాంతాల్లో తల్లి-శిశు ఆరోగ్య సేవలను సమర్ధవంతంగా అందిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. ఈ సందర్భంగా ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సబ్ సెంటర్ సిబ్బందిని అభినందిస్తూ, గ్రామీణ స్థాయిలో నాణ్యమైన సేవలు అందించడం ద్వారా ప్రజల్లో విశ్వాసం పెంచారని ఇలాంటి కృషి మరిన్ని ఆరోగ్య కేంద్రాలకు ప్రేరణగా నిలవాలని ఆకాంక్షించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్ మాట్లాడుతూ.. కామారం సబ్ సెంటర్ సిబ్బంది అంకితభావం ప్రశంసనీయమని ఈ విజయానికి తోడ్పడిన ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్య అధికారిని సిబ్బందిని అభినందించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఇదే సేవా తత్వాన్ని కొనసాగించాలని సూచించారు







- **షీ టీమ్స్, ఏ హెచ్ టి యు కార్యాలయాల్ని సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

మంగళవారం చుంచుపల్లిలోని షీ టీమ్స్, ఏ హెచ్ టి యు కార్యాలయాలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సందర్శించారు.ముందుగా షీ టీం,ఏ హెచ్ టి యుకార్యాలయ పరిసరాలను పరిశీలించారు.మహిళలపై లైంగిక వేధింపులు,ర్యాగింగ్,ఈవ్ టీజింగ్, బ్లాక్మెయిలింగ్, ఇతర ఇబ్బందులు ఎదుర్కునే మహిళలు జిల్లా షీ టీమ్స్ ను నేరుగా సంప్రదించవచ్చని తెలిపారు.మహిళలపై జరుగుతున్న నేరాలను అడ్డుకొని వారికి న్యాయం చేయడానికి వీలుగా ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ తరపున ఏర్పాటు చేసిన టి జి డబ్ల్యు హెచ్ డబ్ల్యు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేకమైన విభాగమే షీ టీమ్స్ అని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ తెలిపారు.జిల్లా షీ టీమ్స్ ఫోన్ నంబరు 8712682131 కి ఫోన్ చేసి తమ సమస్యలని తెలియజేసుకోవచ్చని అన్నారు.ఫిర్యాదు చేసిన వారి వివరాలు పూర్తిగా గొప్యంగా ఉంచబడతాయని అన్నారు.ఫిర్యాదు అందుకున్న వెంటనే నేరస్తుడిని షీ టీం కార్యాలయానికి పిలిచి వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.పరిస్థితిని బట్టి నిందితుడిపై కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు.బాలికలకు,మహిళలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా నిర్భయంగా షీ టీమ్స్ ను సంప్రదించాలని తెలియజేసారు.జనాలు రద్దీగా ఉండే ప్రదేశాలలో,రైల్వేస్టేషన్,బస్టాండ్లు మరియు కళాశాలల వద్ద షీ టీమ్స్ సభ్యులు నిరంతరం సంచరిస్తూ ఆకతాయిల ఆగడాలను నిరోధిస్తూ మహిళలకు అండగా నిలవాలని సూచించారు.





## కలెక్టర్ చే ప్రశంసా పత్రాలను అందుకున్న పీహెచ్ సి సిబ్బంది సన్మానం



జనగామ జిల్లా /రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ ), ఏప్రిల్ 07:

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అటెం దర్గా వైద్య సిబ్బందితో పాటు రోగులకు అత్యుత్తమ సేవలందించిన మరికూకల అయోధ్య, ఆశ వర్కర్ బానోతు మంజుల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె.మల్లిఖార్జున్ రావు చేతుల మీదుగా మంగళవారం ప్రశం సా పత్రం. షీల్డ్ ను అందుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది ఇరువురిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పీహెచ్ సి వైద్యాధికారి బి.స్రవంతి, సిహెచ్ఓ రామ్ కిషన్, సూపర్ వైజర్స్ సులోచన, సుజనా, రజని, వైద్య సిబ్బంది విష్ణువర్ధన్ రెడ్డి, పాండరి తదితరులు పాల్గొన్నారు.



## ఎఫ్సీఐ క్రాస్ రోడ్ వద్దఅంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యేకు వినతి



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఏప్రిల్ 7 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ఎన్టిపిసి ఎఫ్సిఐ క్రాస్ రోడ్ వద్ద ఉన్న అంబేద్కర్ కాంస్య విగ్రహం వద్ద అంబేద్కర్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని మంగళవారం బి.ఆర్. అంబేద్కర్ జయంతోత్సవ కమిటీ సభ్యులు స్థానిక ప్రజాప్రతినిధులను కలిసి జయంతి ఉత్సవాల నిర్వహణపై వినతిపత్రం సమర్పించారు. కమిటీ తరపున డాక్టర్ దుర్గం నరసయ్య (మాజీ అధ్యక్షుడు, ఎన్‌టీపీసీ ఎస్సీ/ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం, దళితరత్న, జాతీయ అంబేద్కర్ పురస్కార గ్రహీత), ఆట ఉమేశ్వర్ (మాజీ ప్రధాన కార్యదర్శి), దేవా లాలయ్య, అక్కపాక రాజయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహంకాళి స్వామి, 24వ వార్డు కార్పొరేటర్ కొలాని కవిత వెంకట్ రెడ్డి, 34వ వార్డు కార్పొరేటర్ స్వప్న ప్రియ భరత్ గౌడ్‌లను మర్యాదపూర్వకంగా కలుసుకుని, ఏప్రిల్ 14న జరగనున్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కోరారు.ఎన్‌టీపీసీ ఎఫ్‌సీఐ ఎక్స్ రోడ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద అధికారికంగా జయంతి వేడుకలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, సంస్థ యాజమాన్యం లేదా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉత్సవాలు జరగేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు సానుకూలంగా స్పందించి, జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



## 54వ డివిజన్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఏప్రిల్ 7 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : జవహర్ నగర్‌లోని 54వ డివిజన్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని 54వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ ముస్తఫా ఆధ్వర్యంలో నిర్వహించగా, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మేయర్ మహంకాళి స్వామి , డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య తో కలిసి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించి ముగ్గు పోశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజా ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను నెరవేర్చేందుకు కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఎంతో మంది పేదల జీవితాల్లో వెలుగు నింపుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, స్థానిక ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## పిసి పిఎన్డిటి చట్టాన్ని ఖచ్చితంగా అమలు చేయాలి...

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు..
- అన్ని స్కానింగ్ యంత్రాలకు తప్పనిసరి రిజిస్ట్రేషన్..
- ఫారం-ఎఫ్ అప్‌లోడ్, రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు..
- క్లినికల్ సంస్థలకు నిబంధనల ప్రకారం అనుమతులు మంజూరు..
- పిసి పిఎన్డిటి చట్టంపై జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అథారిటీ సమావేశాన్ని నిర్వహించిన జిల్లా కలెక్టర్..



ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్/ ఏప్రిల్ 7(అక్షరం న్యూస్ –:
పిసి పిఎన్డిటి చట్టం 1994, రూల్స్ 1996 ను జిల్లాలో ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం పిసి పిఎన్డిటి చట్టంపై జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అథారిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, జిల్లా జడ్జిలు డి. రాం ప్రసాద రావు, వి.శ్రీనయ్య, అదనపు డిసిపి బి.రామానుజంలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాలకు సంబంధించి 10 కొత్త దరఖాస్తులు, 11 రెన్యువల్, మొత్తం 21 పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. తదుపరి సమావేశంలో పూర్తి వివరాలతో రిపోర్ట్ సమర్పించాలని ఆదేశించారు. ప్రతి స్కానింగ్ యంత్రం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్‌లో ఉండాలని, అర్హత కలిగిన వారు మాత్రమే స్కానింగ్ నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రతి స్కాన్‌కు సంబంధించిన వివరాలను ఫారం–ఎఫ్ లో నమోదు చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, అన్ని రిఫరల్ వివరాలు సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. మొబైల్ స్కానింగ్ యంత్రాలు అనుమతించబడవని తెలిపారు. ప్రతి స్కానింగ్ కేంద్రం ఫారం–ఎఫ్ వివరాలను ప్రతి నెలా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారికి సమర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించిన కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో పిసి పిఎన్డిటి కేసులు 5, ఎమ్‌టీపీ కోర్టు కేసులు 3 ఉన్నాయని సంబంధిత అధికారులు వెల్లడించారు. ఖమ్మం జిల్లాలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం 2010 క్రింద మొత్తం 658 సంస్థలు నమోదు అయ్యాయని రెన్యువల్, కొత్త అనుమతులు మంజూరు చేసే సమయంలో అన్ని నిబంధనలను తప్పనిసరిగా రెండు, మూడు సార్లు సమగ్రంగా పరిశీలించాలని, ఈ విషయంలో ఏ చిన్న అంశం కూడా విస్మరించకుండా, ప్రతి ప్రమాణాన్ని ఖచ్చితంగా ధృవీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఐ.ఎం.ఏ. అధ్యక్షులు డాక్టర్ ఎస్. రెహానా బేగం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామారావు, అదనపు డిఎంహెచ్ఓ డా. చందూ నాయక్, డిప్యూటీ డిఎంహెచ్ఓ డా. వేణుమాధవ్, కమిటీ సభ్యులు, ఎన్జీఓ ఎం. కుముదిని, డిసిపిఓ విష్ణు వందన, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

- సీపీ అంబర్ కిషోర్ ఝా
- పెండింగ్ కేసులపై సమగ్ర సమీక్ష --- వేగవంతమైన దర్యాప్తుకు ఆదేశాలు

జ్యోతి నగర్ ఎన్టిపిసి ఏప్రిల్ 7 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ అధికారుల నేర సమీక్షా సమావేశం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు, దర్యాప్తులో ఉన్న కేసులు,వారెంట్ల అమలు,పోలీస్ సిబ్బంది పనితీరును సమగ్రంగా సమీక్షించారు. ఇప్పటివరకు నమోదైన కేసులు, పెండింగ్‌లో ఉన్న పాత కేసులపై సీపీ ప్రత్యేకంగా దృష్టి సారించారు. దర్యాప్తులో జాప్యానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితులకు న్యాయం త్వరితగతిన అందేలా న్యాయాధికారులతో సమన్వయం పాటించాలని సూచించారు. దొంగతనాల నివారణ మరియు కేసుల ఛేదనపై సమీక్షిస్తూ, నేరస్తులను పట్టుకోవడంలో ఆధునిక సాంకేతికతను వినియోగించాలని ఆదేశించారు. రికవరీ శాతం పెంచి బాధితులకు వారి సొత్తును తిరిగి అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చోరీలకు పాల్పడే వ్యక్తులపై హిస్టరీ షీట్లు తెరవాలని తెలిపారు. చోరీలు జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలు, కాలనీలు, వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేపట్టాలని సూచించారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన కెమెరాల పనితీరును స్టేషన్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.



ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) గుర్తించి సంబంధిత శాఖలతో సమన్వయం పాటిస్తూ నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక "అరైవ్–అలైవ్" కార్యక్రమం ద్వారా ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో అవగాహన పెంచాలని పేర్కొన్నారు. మహిళలు, చిన్నారులు మరియు వృద్ధుల భద్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించి,వారి ఫిర్యాదులపై తక్షణ స్పందన ఇవ్వాలని ఆదేశించారు. పెట్రోలింగ్ మరియు బ్లూ కోల్ట్స్ వాహనాలతో పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు,జూదం మరియు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్,పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్,జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్,స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, సీఐలు, ఇన్స్పెక్టర్లు,ఎస్ఐలు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

- సీఎం రేవంత్ రెడ్డి సంకల్పంతో గ్రామాలు సస్యశ్యామలం అవుతున్నాయి ప్రభుత్వం విప్

ఓదెల/పెద్దపల్లి ఏప్రిల్ 07(అక్షరం న్యూస్)

ప్రజా ప్రభుత్వం తోటే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి సంకల్పంతో ప్రతి గ్రామం సస్యశ్యామలమవుతుందని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణారావు అన్నారు ఈ సందర్భంగా మంగళవారం ఓదెల మండలంలోని పిట్టల ఎల్లయ్య పల్లె గ్రామంలో సీసీ రోడ్డు ప్రారంభించారు అదేవిధంగా నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు

ఈ సందర్భంగా గ్రామంలో ప్రథమ పౌరుడు పిట్టల రవికుమార్ ముదిరాజ్ అధ్యక్షతతో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణారావు మాట్లాడుతూ

ప్రజా ప్రభుత్వం తోటే గ్రామాలన్ని అభివృద్ధి చెందుతున్నాయని అదేవిధంగా ప్రియతమ నాయకుడు సీఎం రేవంత్ రెడ్డి సంకల్పంతో ప్రతి గ్రామము సస్యశ్యామలంగా మారుతుందని అన్నారు ఈ గ్రామంలో 65 లక్షల నిధులతో గ్రామ అభివృద్ధి కోసం వెచ్చించడం జరిగిందని పాఠశాల కాంపౌండ్ వాల్ మరియు అంగన్వాడి భవనం మహిళా ఐకెపి సంబంధించిన మహిళా సమైక్య భవనం కోసం వారం రోజుల్లో 5 లక్షల రూపాయల నిధులు మంజూరు చేస్తామని అన్నారు అదేవిధంగా ఈరోజు.35 లక్షలతో సిసి రోడ్డు మరియు నూతన గ్రామపంచాయతీ భవనానికి శంకుస్థాపన చేసుకోవడం జరిగిందని గ్రామ సర్పంచి యువకుడు మంచి ఉత్సాహవంతుడు అతని ఆలోచన విధానంతో గ్రామానికి మరిన్ని నిధులు ఇచ్చి గ్రామం అభివృద్ధి అయ్యేందుకు తప్పకుండా కృషి చేస్తానని అదేవిధంగా ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి గ్రామం ఎంతో అభివృద్ధి వైపుకు దూసుకుపోతుందని నూతనంగా ఏర్పడ్డ సర్పంచులు మంచి ఉత్సాహంతో గ్రామాల అభివృద్ధి చేసేందుకు ఉత్సాహంగా ఉన్నారని వారి ఉత్సాహానికి ప్రోత్సహిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అనేక నిధులను మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు అదేవిధంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులు సంతోషంగా ఉన్నారని ఏ గ్రామంలో చూసిన నీటి నిల్వలు పుష్కలంగా ఉండి చెరువులన్నీ నిండికుండలా ఉన్నాయని గ్రామంలో నీటి ఎద్దడి ఏర్పడకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని గత ప్రభుత్వం ఆయంలో ఈ సమయంలో పంటలు పండుతాయో ఎండుతాయోఅని అయోమయంలో రైతులంతా ఉండేవారని ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదని నీళ్లు సమృద్ధిగా రావడంతో రైతులు చాలా ఆనందంగా ఉన్నారని అదేవిధంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకునే బాధ్యత కూడా మాదేనని అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు చేపడుతూ ప్రజలకు మరింత దగ్గర అవుతుందని అన్నారు అదేవిధంగా ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పిస్తూ ప్రతి గ్రామానికి బస్సు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందని ప్రజారావాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయడమే నా సంకల్పం అని అన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిట్టల రవికుమార్ ముదిరాజ్. ఉప సర్పంచ్ శ్రీకాంత్ ముదిరాజ్. ఎంపీడీవో అనిల్ రెడ్డి హౌసింగ్ ఏఈ వసంత మరియు కార్యదర్శి కనగర్తి సర్పంచ్ చొప్పరి సంధ్య కుమార్ మాజీ చైర్మన్ సింగిల్ విండో. ఆళ్ల సుమన్ రెడ్డి . ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు రెడ్డి రజనీకాంత్ నాయకులు గోపు నారాయణరెడ్డి జైపాల్ రెడ్డి. ఆకుల మహేందర్ డైరెక్టర్లు బొంగుని శ్రీనివాస్ గౌడ్ జిల్లా పిసిసి అధికార ప్రతినిధి బైరి రవి గౌడ్ మరియు పడాల రాజు నిమ్మ నాయక్.. రంగు మల్లేష్ గౌడ్ నోముల సాగర్ రెడ్డి నాయకులు యాదగిరి సమ్మయ్య కొమురయ్య నరేష్ వివిధ గ్రామాల సర్పంచులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు





## ప్రభుత్వ విప్ విజయ రమణారావు కు ఘన సన్మానం



సుల్తానాబాద్,(పెద్దపల్లి జిల్లా), ఏప్రిల్ 7, అక్షరం న్యూస్.

మంగళవారం రోజు ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన10 వ వార్డు సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్ ను సుల్తానాబాద్ పట్టణ ముస్లిం మైనారిటీ నాయకులు గజ మాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో పెద్దపల్లి జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ మోబిన్, జిల్లా కాంగ్రెస్ మైనారిటీ ఉపాధ్యక్షుడు అబ్దుల్ రహీం , మాజీ కౌన్సిలర్ రఫీ ల తో పాటు సుల్తానాబాద్ మైనార్టీ ప్రజలు పాల్గొన్నారు.

## వినతి పత్రం అందజేసిన రెండవ ఏ.ఎన్.ఎం. లు

- స్పందించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణారావు.
- న్యాయం జరిగేలా చూస్తామని హామీ.



సుల్తానాబాద్,(పెద్దపల్లి జిల్లా), ఏప్రిల్ 7, అక్షరం న్యూస్.

తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణారావు కు ఏఎన్ఎం లు,వినతిపత్రం అందజేశారు. గత 20 సంవత్సరాలుగా చాలీ చాలని వేతనాలతో, పని భారం తో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని తెలిపారు. గత ప్రభుత్వం తమను రెగ్యులర్ చేస్తానని చేయలేదని వాపోయారు. ప్రభుత్వం చేస్తున్న ప్రతి సంక్షేమ పథకంలో తాము కూడా భాగస్వామ్యం వహిస్తున్నామని, ప్రబుత్వ ఆదేశాలను ఐ తూచా తప్పకుండా పాటిస్తూ రాత్రింబవళ్లు, అదనంగా పని భారం మోపినా విధులు నిర్వహిస్తున్నామని, ఎమ్మెల్యే విజయరమణారావు తమ గోడును విన్నవించుకున్నారు. గతంలో తాము చేసిన ధర్నా కు హాజరైన అప్పటి ప్రతిపక్ష నేత గా తమకు ఇచ్చిన హామీ ను ఈ సంధర్భంగా ఎమ్మెల్యే కు గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో తమకు న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉందని అందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దకు తమ సమస్యల పై చర్చించాలని కోరారు. ముఖ్యమంత్రి అత్యంత సన్నిహితులైన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణారావు చొరవ తో తమ సమస్యలు తీరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అందుకు ఎమ్మెల్యే విజయరమణారావు సానుకూలంగా స్పందిస్తూ,ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్ళి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

## హిందూ సమ్మేళన నిర్వహణ కమిటీ నియామకం

- **అధ్యక్షుడిగా భీమర లక్ష్మణ్**
- **శతాబ్ది ఉత్సవాల వేళ..ఇందుర్తిలో హిందూ ధర్మ భేరి**



చిగురుమామిడి/ఏప్రిల్ 07 (అక్షరం న్యూస్) గ్రామంలో ఈనెల 26న నిర్వహించనున్న సంఘ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేసేందుకు "శ్రీహరి హర హిందూ సమ్మేళన సమితి"నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఇందుర్తి గ్రామంలోఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.కమిటీ అధ్యక్షుడిగా భీమర లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా దేవునూరు చంద్రయ్య, గట్టు ఎల్లయ్య, కోశాధికారిగా అచ్చ రవీందర్ ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా జి. మధుసూదన్ రెడ్డి, ఎన్. కిరణ్, ఎం. చంద్రయ్య, కె. సంతోష్, కె. శ్రీనివాస్ రెడ్డి, కె. శ్రీనివాస్, ఎస్. అనిల్ బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు ఆవుల కుమార్, మొగిలి సంపత్ మాట్లాడుతూ.. హిందూ ధర్మాన్ని రక్షించుకోవడానికి, సామాజిక సమరసతను పెంపొందించడానికి ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. దేవాలయ వ్యవస్థను బలోపేతం చేయడం, స్వదేశీ వస్తువుల వాడకాన్ని ప్రోత్సహించడం, దేశాన్ని విశ్వగురువుగా నిలపడమే ఈ సమ్మేళన ప్రధాన ఉద్దేశమని వారు పేర్కొన్నారు.

## ఘనంగా పెనుగొండ ఉపేంద్ర రావు సరిత దంపతుల పుట్టినరోజు వేడుకలు ..

- **పుట్టినరోజున పలు సేవా కార్యక్రమాలు..**
- **గో పూజలు మహిళల కు చీరలపంపిణి ..**



ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్/ ఏప్రిల్ 7(అక్షరం న్యూస్ –:
వైరా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ రీజన్ సెక్రటరీ పెనుగొండ ఉపేంద్రరావు సరితల పుట్టినరోజు పురస్కరించుకొని లయన్స్ క్లబ్ వైరా అధ్యక్షులు వై.బుచ్చి రామారావు ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని, వారు గత 12 సంవత్సరాలుగా లయన్స్ క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని జోన్ చైర్మన్ చింతోజు నాగేశ్వరరావు జిల్లా మహిళా కోఆర్డినేటర్ 12వ వార్డు కౌన్సిలర్ శ్రీమతి మాదినేని సునీత అన్నారు. పుట్టినరోజున స్థానిక వినాయక మందిరం నందు పూజా కార్యక్రమాల గో పూజలు నిర్వహించిన అనంతరం గోశాలకు గో గ్రాసం మరియు పలువురు మహిళలకు చీరలు పంపిణీ చేసిన సందర్భంగా వారు పాల్గొని మాట్లాడుతూ ప్రతి లయన్స్ సభ్యులు పుట్టినరోజు పెళ్లి రోజు లు పురస్కరించుకొని గత 12 సంవత్సరాలుగా సేవలందిస్తున్నారని ప్రతి మనిషి తన సంపాదనలో సేవా కార్యక్రమాలకు కేటాయించాలని వారు సూచించారు.సమాజం లో




ఎంతోమంది అభాగ్యులు ఉన్నారని వారికి తగిన విధంగా ఆదుకోని సేవలుఅందించటం ముఖ్యం అని అన్నారు. ప్రతి మనిషి తన సంపాదనలో సమాజ సేవకు ఉపయోగించి వారి మనసులో సుస్థిర స్థానం సంపాదించాలని వారు పేర్కొన్నారు. అప్పుడే మానవజన్మ సార్ధకమవుతుందని తెలిపారు అనంతరం ప్రధాన రహదారి వెంబడి ఎండలో సోడాల వ్యాపారం నిర్వహిస్తూ జీవనాన్ని పోషించుకుంటున్న వ్యాపారికి లయన్స్ గొడుగును డిస్టిక్ చైర్పర్సన్ అంజిరెడ్డి సహకారంతో పంపిణీ చేసారు పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసిన లయన్స్ క్లబ్ సభ్యులందరికీ పెనుగొండ ఉపేంద్రరావు సరిత దంపతులు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వరసిద్ధిమందిరం చైర్మన్ పుప్పాలఅనంతరామయ్య లయన్స్ కోశాధికారి గద్దె నీరజ సభ్యులు నంబూరు రామారావు, మాదినేనిదుర్గా ప్రసాదు, పెనుగొండ రిషి వర్ష ,నల్లమోతు లక్ష్మీనారాయణ, కొమిరిశెట్టి శ్రీధర్, కట్ల సురేష్, నూకల ప్రసాదరావు , మరికంటి రాంగోపాల్, పదిమల పుష్పలత, కొల్ల రాంబాబు తదితరులు పాల్గొనికేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసారు.



# ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

- **జడ్జి దుర్గం గణేష్**
- **ప్రతిమ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం**

సుల్తానాబాద్,(పెద్దపల్లి జిల్లా), ఏప్రిల్ 7, అక్షరం న్యూస్.

ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్య పట్ల శ్రద్ధ వహించాలని సుల్తానాబాద్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేష్ అన్నారు. మంగళవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు బార్ అసోసియేషన్ కార్యాలయంలో ప్రతిమ ఫౌండేషన్ చే ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం ను జడ్జి గణేష్ ప్రారంభించారు. ప్రతిమ హాస్పిటల్ వైద్యులు న్యాయవాదులకు, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బందికి, కక్షిదారులు తో పాటు సుమారు 150 మందికి బి.పి., షుగర్, ఈసీజీ, కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్జి గణేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఆహారం విషయంలో శ్రద్ధ వహించాలని, ఆకుకూరలు, విటమిన్స్ లభించే ఆహారాన్ని తీసుకోవాలని అన్నారు. రైస్ మిల్లుల ద్వారా వచ్చే కాలుష్యం తో రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వయసు మీరిన వారికి మితాహారం శ్రేయస్కరం అని అన్నారు. వ్యాయామం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వొడ్నాల రవీందర్ , ప్రధాన కార్యదర్శి అవునూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు ఆవుల శివకృష్ణ, ఏపీపీ శ్యామ్ ప్రసాద్ రావు, ఏజీపీ దూడం ఆంజనేయులు, ప్రతిమ సీఈవో సి. రాంచందర్ రావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సి యన్ ప్రసాద్, హెల్త్ క్యాంపు ఇంచార్జ్ కౌశిక్ , ప్రతిమ ఫౌండేషన్ మేనేజర్ గీతా రెడ్డి, న్యాయవాదులు ఆవుల లక్ష్మి రాజం, పడాల శ్రీరాములు బోయిని భూమయ్య పడాల అంజయ్య, జోగుల రమేష్, సామల రాజేంద్రప్రసాద్ , వడ్లకొండ రవికిరణ్, మల్యాల కరుణాకర్, ఆర్. నరసయ్య, వేముల స్నేహ, మాడూరి పృథ్వీ, లెక్కల గంగాధర్ లతో పాటు ప్రతిమ హాస్పిటల్ వైద్య సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం





- **ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం.**
- **రాష్ట్ర ప్రభుత్వ విప్.చింతకుంట విజయరమణారావు.**

సుల్తానాబాద్,(పెద్దపల్లి జిల్లా), ఏప్రిల్ 7, అక్షరం న్యూస్.

సుల్తానాబాద్ పట్టణంలోని రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో మంగళవారం రోజు ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన10 వ వార్డు సభలో ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు పాల్గొన్నారు.అనంతరం గర్రెపల్లి పిహెచ్సి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెచ్ పి వి వ్యాక్సిన్ కార్యక్రమాన్ని, లయన్స్ క్లబ్ సహకారంతో ఏర్పాటుచేసిన ఉచిత కంటి చికిత్స శిబిరాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణా రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ,రైతు బీమా మాదిరిగా తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి బీమా సదుపాయాన్ని కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ పథకాన్ని తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి దినోత్సవ రోజు జూన్ 2న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు అల్పాహారం, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం సమకూర్చేందుకు ప్రభుత్వం పరిశీలన చేస్తోందని వివరించారు. ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం, రుణమాఫీ, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీ లేని రుణాలు లాంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. అభివృద్ధి విషయంలో సుల్తానాబాద్ పట్టణాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దినట్లు తెలిపారు. అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పట్టణంలో చాలామంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు పనులు ప్రారంభించలేదని, ఈ దిశగా అధికారులు అవసరమైన ప్రయత్నాలు చేయడం లేదని ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపల్ కమిషనర్ వెంటనే రివ్యూ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, కౌన్సిలర్లు చింతల రాజు, గరిగే శోభారాణి, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, ఎంపీడీవో, హౌసింగ్ డిఈ ఈ, ఏఈ, గర్రెపల్లి పీహెచ్ సీ డాక్టర్లు, సిబ్బంది, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి, సంక్షేమం మా ప్రభుత్వ లక్ష్యం..

- **ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి.**
- **ముదిగొండ మండలం లో విస్తృత పర్యటన ..**
- **రూ.60 లక్షల నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు..**

ఖమ్మం జిల్లా/ ముదిగొండ టౌన్/ ఏప్రిల్ 7 (అక్షరం న్యూస్ –:: అభివృద్ధి, ప్రజా సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు ముదిగొండ మండలంలో విస్తృతంగా పర్యటించారు. న్యూ లక్ష్మీపురం, పమ్మి, కమలాపురం, బాణాపురం, వల్లభి, గంధసిరి గ్రామాల్లో పర్యటించి రూ.60 లక్షల నిధులతో నిర్మించిన సిసి రోడ్లు, బోర్ వెల్ లను ప్రారంభించారు. పలుచోట్ల సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ.. అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. తన నిధులను గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కేటాయిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కుమ్మినేని రమేష్, పార్టీ మండల నాయకులు దేవరపల్లి అనంతరెడ్డి, సర్పంచులు, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.







# గ్రీన్ ఫీల్డ్ హైవేకు మెటీరియల్ తోలారు మా రహదారి ధ్వంసం చేశారు..

- రహదారి పునర్ నిర్మించాలి..





ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్/ ఏప్రిల్ 7 (అక్షరం న్యూస్ –:
తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలిపే హైవే నిర్మాణం చేపట్టారు తల్లాడ మండలం మిట్టపల్లి నుండి రామానుజవరం గ్రామం వరకు ఆర్ అండ్ బి రహదారి ఉంది గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనుల కోసం కంకర ఇతరత్రా మెటీరియల్ భారీ టిప్పర్లతో తోలడంతో రోడ్లు ధ్వంసం అయ్యాయి, భారీ వాహనాలతో అత్యధిక బరువుతో తిరగడంతో రహదారి మొత్తం భారీ గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది, సదరు రోడ్డులో రాకపోకల సాగించాలంటే ద్విచక్ర వాహనదారులు ఇతర వాహనదారులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు, ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి, దుమ్ము ధూళితో, వాహన చోదకులు ఇబ్బందులకు గురవు తున్నరు, రోడ్డు ఎక్కడుందో గుంత ఎక్కడుందో అర్థం కాక ప్రమాదాలు సంభవిస్తున్నాయి, ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు స్పందించి వెంటనే రహదారిని నిర్మించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



## వసతి గృహాల నిర్వహణలో నిర్లక్ష్యం ఇద్దరు

# వార్డెన్ల సస్పెన్షన్‌కు జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశం



భద్రాద్రి కొత్తగూడెం/ ఇల్లందు/ ఏప్రిల్ 7/ అక్షరం న్యూస్ –:
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణంలో జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం విస్తృతంగా పర్యటిస్తూ ప్రభుత్వ ఆసుపత్రి, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలు మరియు వివిధ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సేవలు, విద్యార్థుల సంక్షేమం, ఆహార నాణ్యత, పరిశుభ్రత, మౌలిక వసతులపై సమగ్రంగా పరిశీలించి లోపాలు గమనించిన చోట్ల కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.మొదటగా ఇల్లందు వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్, ఆసుపత్రి నిర్వహణ, వైద్య సేవలు, మౌలిక సదుపాయాలపై సమగ్రంగా పరిశీలించారు. ఆసుపత్రి ఎదుట ప్రైవేట్ అంబులెన్స్ నిలిపి ఉంచడం గమనించి దాని అవసరం, అనుమతులపై అధికారులను ప్రశ్నించారు. ఆసుపత్రి ఆవరణలో ప్రైవేట్ కార్యకలాపాలు నిర్వహించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ తగిన వివరణ ఇవ్వాలని ఆర్ఎంఓను ఆదేశించారు.ఇన్‌పేషెంట్ విభాగాన్ని పరిశీలించి రోగులతో మాట్లాడిన కలెక్టర్, వారికి అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. డయాలసిస్ కేంద్రాన్ని తనిఖీ చేసి కేసుల సంఖ్య, సేవల నాణ్యతపై ఆరా తీశారు. ఈ ప్రాంతంలో డయాలసిస్ కేసులు అధికంగా నమోదవుతున్న కారణాలను అధ్యయనం చేయాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది హాజరు నమోదు పుస్తకాలను పరిశీలించి విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరించారు. ఆసుపత్రికి అవసరమైన అంబులెన్స్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ సందర్భంగా ఒక బాధితుడు అందజేసిన వినతి పత్రంపై స్పందించిన కలెక్టర్, అత్యవసర సమయంలో ప్రవేట్ అంబులెన్స్ మాట్లాడుకున్నప్పటికీ అధిక డబ్బు ఆశతో నిర్లక్ష్యం వహించడం వల్ల రోగి మరణించిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబులెన్స్ సేవల్లో నిర్లక్ష్యం జరిగిందని భావిస్తూ సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ఆదేశించారు. అత్యవసర సేవల్లో ఎటువంటి లోపాలు సహించబోమని స్పష్టం చేశారు.అనంతరం ఇల్లందు ట్రైబల్ వెల్ఫేర్ ఎస్టీ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, వంటశాలలో సిద్ధం చేస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం విభిన్న వంటకాలు అందించకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ విద్యార్థుల పోషణలో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. స్టోర్ రూమ్‌ను పరిశీలించి సరుకుల నాణ్యత, నిల్వ విధానాలపై అధికారులకు సూచనలు చేశారు. విద్యార్థులతో ముచ్చటించి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని భవనం మరమ్మతులు, ఫ్యాన్లు, తాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్, విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న సదుపాయాలు, భోజన నాణ్యత, బోధనపై వివరాలు తెలుసుకున్నారు. భోజనం సమయానికి సంబంధించి సిబ్బంది సరైన సమాచారం ఇవ్వకపోవడం, మెనూ పాటించకపోవడం మరియు పరిశుభ్రత లోపాలు గమనించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం క్షమించబోమని స్పష్టం చేస్తూ, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన వార్డెన్ భరత్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని ఆదేశించారు.ఇల్లందు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ బాలుర వసతి గృహాన్ని పరిశీలించిన కలెక్టర్‌కు విద్యార్థులు వార్డెన్ సిబ్బంది ఎవరు లేకపోవడం గమనించి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వసతి గృహ నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించడంతో సంబంధిత వార్డెన్‌పై కఠిన చర్యలు తీసుకుని వెంటనే సస్పెండ్ చేయాలని ఆదేశించారు.వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, నిర్ణీత సమయానికి భోజనం సిద్ధం కాకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది విధుల్లో లోపాలు గమనించి వార్డెన్‌ను హెచ్చరించారు. విద్యార్థులకు సమయానికి నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించడం తప్పనిసరి బాధ్యత అని స్పష్టం చేశారు.వసతి గృహాల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించిన ఇద్దరు వార్డెన్లను సస్పెండ్ చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశిస్తూ, విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్యం, భద్రత విషయాల్లో అధికారులు అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. విద్య, వైద్యం మరియు సంక్షేమ రంగాల్లో ఎటువంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ హర్షవర్ధన్, ఆర్ఎంఓ రామ్ నివాస్, డ్యూటీ డాక్టర్ ప్రత్యూష, వస్తి గృహాలు వార్డెన్లు సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆరోగ్య కేంద్రాలలో మెరుగైన వైద్య సేవలు అందించాలి..

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ఆసుపత్రిలో మందుల నిల్వలు సమృద్ధిగా ఉంచాలి..
- ఖమ్మం వెంకటేశ్వర్ నగర్ అర్బన్ పి.హెచ్.సి. ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్..



ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్/ఏప్రిల్ 7 (అక్షరం న్యూస్ –:
ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.జిల్లా కలెక్టర్, స్థానిక వెంకటేశ్వర నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు, మందుల నిల్వలు, ల్యాబ్, మెడికల్ వార్డ్, టాయిలెట్లు, శుభ్రత తదితర అంశాలను పరిశీలించారు.జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆసుపత్రిలో అవసరమైన ఔషధాల లభ్యతపై ప్రత్యేకంగా విచారించి, అన్ని రకాల అవసరమైన మందులను తగిన స్థాయిలో నిల్వ ఉంచాలని ఆదేశించారు. ఆసుపత్రి రిజిస్టర్లన్నింటినీ స్వయంగా పరిశీలించి, రోగులకు అందుతున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ల్యాబ్ పరీక్షలు, డయాగ్నస్టిక్ హబ్ సేవల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, అన్ని పరీక్షల రిపోర్ట్ లను వీలైనంత త్వరగా రోగులకు అందించాలని ఆదేశించారు.రోగులకు సమయానికి సరైన చికిత్స అందించడంతో పాటు అవసరమైన అన్ని రకాల ఔషధాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచి, రోగులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని అన్నారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని తెలిపారు.జిల్లాలోని ప్రతి పి.హెచ్.సి., అర్బన్ పి.హెచ్.సి. లలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది వివరాలను సమగ్రంగా సమర్పించాలని, ప్రతి కేంద్రంలో మంజూరు చేసిన పోస్టులు, ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది, ఖాళీల వివరాలను స్పష్టంగా తెలియజేయాలని, ఈ నివేదిక ఆధారంగా జిల్లాలో సిబ్బంది ఎక్కడ తక్కువగా ఉన్నారో గుర్తించి తక్షణమే సరి చేయడానికి అవకాశం ఉంటుందని, డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న సిబ్బంది సంఖ్యను కూడా ఖచ్చితంగా ధృవీకరించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ ఏఓ డాక్టర్ మోత్యను ఆదేశించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట వైద్యాధికారిణి ఐ. దేవి శ్రీ, నర్సింగ్ అధికారిణి సయ్యద్ షమీమ్, ఫార్మసిస్ట్ ఎస్.కే. ముదస్సర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పాలనలో పేదల ఆరోగ్యానికి భరోసా..

- ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి
- 268 మంది లబ్ధిదారులకు రూ.75.40 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..



ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్/ ఏప్రిల్ 7/ (అక్షరం న్యూస్ –:: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పేదల ఆరోగ్యానికి భరోసా లభిస్తోందని, పేదలందరికీ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి అన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటళ్లలో అత్యవసర వైద్య చికిత్సలు పొందిన పేదలను ఆదుకునేందుకు తన సిఫారసుతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను మంగళవారం ఖమ్మం లోని గట్టయ్య సెంటర్ లో గల క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేశారు. పలు మండలాలకు చెందిన 268మందికి రూ. 75.40 లక్షల మేరకు లబ్ధి చేకూరింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దినేని స్వర్ణకుమారి తదితరులతో కలిసి ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ.. ఆరోగ్య భద్రతలో ముందుంటూ పేదలకు అండగా నిలుస్తోశీదని చెప్పారు. ఈ సందర్భంగా సీఎంఆర్ఎఫ్ చెక్కులు పొందిన లబ్ధిదారులంతా.. ఎంపీ రఘురాం రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, పలువురు సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల బాధ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# కామాక్షి ఆలయాన్ని సందర్శించిన విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ ఏప్రిల్ 7/ అక్షరం న్యూస్ – :
తెలంగాణ విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ఉషారాణి సోమవారం రాత్రి మందమర్రి పట్టణంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కామాక్షి ఆలయాన్నీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు సాదర స్వాగతం పలికారు. ఆలయ పూజారులు ఆలయ ప్రసస్తిని ఆమెకు వివరించారు. అనంతరం ఆమె చేత ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం మహిళా పూజారులు శాలువాతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని పూలు పళ్ళు సారే అందజేసి ఆశీర్వదించారు. వీరి వెంట ప్రభుత్వ ఉపాధ్యాయురాలు బండ శాంకరి ఉన్నారు.

# అధికారులు సిబ్బంది సమయపాలన పాటించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్.




మంచిర్యాల జిల్లా మందమర్రి/ ఏప్రిల్ 7/అక్షరం న్యూస్ – :
ప్రభుత్వ ఉద్యోగులు అధికారులు సమయపాలన పాటించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం మందమర్రి మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించారు. అధికారులు, సిబ్బంది విధులలో సమయపాలన పాటించాలని, వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలకు జవాబుదారీతనంగా వ్యవహరించాలని తెలిపారు. అధికారులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి విధులకు హాజరు కాని 6 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని తహసిల్దార్ ను ఆదేశించారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన భూ సంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులతో సరిచూసి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని, వివిధ ధ్రువపత్రాల కొరకు వచ్చిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పల్లా కిరణ్ మాతృమూర్తి 2వ వర్ధంతి రోజున నిరుపేద అనాథ బాలికలకు అండగా ఉండి మరోసారి మానవత్వాన్ని చాటుకున్న పల్లా కిరణ్...



ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్/ఏప్రిల్ 7 / అక్షరం న్యూస్ –:
ఖమ్మం నగరంలో ఎస్పీ ఆఫీస్ రోడ్డు నందు పల్లా కిరణ్ మాతృమూర్తి
కీ.శే. పల్లా సుశీల 2వ వర్ధంతిని పురస్కరించుకొని, సెయింట్ మేరీస్ అనాథ బాలికల హాస్టల్ లో నివసిస్తున్న సుమారు 100 మంది తల్లిదండ్రులు లేని నిరుపేద అనాథ బాలికలకు అండగా నిలబడి, బాలికలకు పరీక్షల సమయంలో ఇబ్బంది కలగకుండా పరీక్ష ప్యాడ్లు, బ్లూ పెన్స్, బ్లాక్ పెన్స్, రెడ్ పెన్స్, పెన్సిల్స్, జామెట్రీ కం బాక్స్, స్కేల్స్, ఎరేజర్స్, షార్నర్స్, పౌచులు మరియు తదితర వస్తువులను మరోసారి మానవత్వాన్ని చాటుకున్న పల్లా కిరణ్అందజేశారు.అదే విధంగా వారికి స్వీట్ ప్యాకెట్స్ కూడా అందజేసి వారి ఆనందానికి కారుకులైనారు. ఈ కార్యక్రమంలో పల్లా కిరణ్ సైన్యం సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పల్లా కిరణ్ మాట్లాడుతూ, గత 20 సంవత్సరాలుగా వివిధ వర్గాల ప్రజల కోసం అనేక సేవా కార్యక్రమాలు ఉదాహరణకు సంవత్సరానికి 2 రెండు సార్లు ఉచిత మోగా వైద్య శిబిరం నిర్వహించుట, కరోనా సమయంలో 3000 మందికి మామిడికాయ పచ్చడి పంపిణీ, ప్రైవేటు టీచర్స్ మరియు పేదలకు బియ్యం, నిత్యవసర సరుకులు పంపిణీ, వరదల సమయంలో నిత్యం అందుబాటులో ఉంటూ వరద బాధితులకు ఆహారం, నీరు, నిత్యవసర సరుకులు మరియు బట్టలు పంపిణి ఇలా అన్ని వర్గాల ప్రజలకు అనేక సందర్భాల్లో అన్న దానాలు, నిరుపేద విద్యార్థిని, విద్యార్థులకు ప్రాథమిక మరియు ఉన్నత విద్య కొరకు ఆర్థిక సహాయం. వృద్ధులకు, వికలాంగులకు, మహిళలకు, అనాథ బాలబాలికలకు మరియు యువతకు నిత్యం అనేక విధాలుగా అండగా ఉంటూ సహాయ సహకారాలు అందిస్తు అండగా ఉండడం సంతోషంగా ఉన్నదని వ్యక్తం చేశారు.



## విశ్రాంత పోలీసు అధికారులకు ఉచిత గుండె వైద్య శిబిరం...



ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్/ఏప్రిల్ 7 (అక్షరం న్యూస్ –:
విశ్రాంత పోలీసు అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం సిటీలోని స్తంభాద్రి ఆసుపత్రిలో మంగళవారం గుండె సంబంధిత ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు, శిబిరాన్ని ఉద్దేశించి ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ పేర్ల హర్ష తేజ మాట్లాడుతూ గుండె జబ్బులు ఉన్నవారు ఎండాకాలంలో జాగ్రత్తగా ఉండాలని, దాహం వేయకపోయినా తరచుగా నీరు, కొబ్బరినీరు, మజ్జిగ, నిమ్మరసం లాంటివి తాగాలని, శరీరాన్ని హైడ్రేటుగా ఉంచుకోవాలని, ఎండ తీవ్రత సమయాల్లో బయటకు వెళ్లొద్దని తేలికపాటి సులభంగ జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలని, బయటకు వెళ్లే వారు తేలికపాటి వదులుగా ఉన్న కాటన్ దుస్తులు ధరించాలని, ఉదయం లేదా సాయంత్రం మాత్రమే వ్యాయామం చేయాలని, ఆల్కహాల్ కు, కాఫీ టీలకు దూరంగా ఉండాలని అన్నారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.రాధాకృష్ణమూర్తి రుద్ర వెంకటనారాయణలు డాక్టర్ పేర్ల హర్ష తేజకు కృతజ్ఞతలు తెలిపి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత
ఎస్సై మరియు ఏఎస్ఐలు వి. వెంకటేశ్వరరావు ఎండి ఇస్మాయిల్,బి ప్రభాకర్ రావు, ఎం ఆంథోనీ, కామేశ్వరరావు, రంగాచార్యులు, కృష్ణమూర్తి మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



### అవసరమైన ప్రతి గ్రామంలో మొక్కజొన్న

# కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి..

- 26 క్వింటాల నిబంధన ఎత్తివేయాలి ...
- ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి .
- ఏప్రిల్ చివరి వరకు సాగర్ జలాలు విడుదల చేయాలి..
- భూ కలిగి ఉన్న ప్రతి రైతుకు భూ భారతి లో పాస్ పుస్తకాలు మంజూరు చేయాలి...
- సాదాబైనమా దరఖాస్తులు పరిశీలించి అర్హులైన రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలి ..
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో
- ఖమ్మం కలెక్టరేట్ ఎదుట రైతులు భారీ ధర్నా ...
- రైతులు చెమటోడ్చి పండించిన పంట కు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందించే బాధ్యత ముగ్గురు మంత్రులదే ..
- రైతు సంఘం నేతలు నున్నా, బొంతు

ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్/ఏప్రిల్ 7 (అక్షరం న్యూస్ –::–
మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు సకాలంలో ప్రారంభించకుండా ప్రభుత్వం జాప్యం చేయడం వలన ఖమ్మం జిల్లా రైతులకు తీవ్రమైన ఆర్థిక నష్టం జరుగుతుందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు అన్నారు.అవసరమైన ప్రతి గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎకరాకు 26 కింటాలు మాత్రమే కొనుగోలు చేస్తామని కేంద్ర ప్రభుత్వం పెట్టిన షరతును తొలగించాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని, ఏప్రిల్ చివరి వరకు సాగర్ జలాలు అందించాలని,సాదాబైనమా దరఖాస్తులు పరిశీలించి అర్హులైన రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని, భూమి కలిగిన ప్రతి రైతుకు భూభారతి పోర్టల్ ద్వారా పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట రైతులు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ సకాలంలో మొక్కజొన్న వరి ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆర్థికంగా క్వింటాకు 700, 800 రూపాయలు నష్టపోతున్నారన్నారు ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 54 కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా కేవలం ఏడు కేంద్రాలు ప్రారంభించి అక్కడ కూడా కాటాలు వేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని వెంటనే అవసరమైన ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు తెలంగాణ రైతు సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎకరాకు 26 గంటలు మాత్రమే కొనుగోలు చేయాలని విధించిన నిబంధన వల్ల ఖమ్మం జిల్లా రైతులకు తీరని అన్యాయం జరిగే అవకాశం ఉందని రవి సీజన్లో ఖమ్మం జిల్లా వ్యాప్తంగా సరాసరి 45 క్వింటాలు దిగుబడి వచ్చిందని ప్రభుత్వం కొనే 26 క్వింటాలు పోను మిగతా పంట ఎక్కడ విక్రయించాలని ప్రశ్నించారు ప్రభుత్వ నిబంధనలు సడలించి రైతులు పండించిన ప్రతి గింజ ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రాల్లో లేదా మండలానికి ఒక కేంద్రం లో మాత్రమే కొనుగోలు చేస్తే రైతులు పంట విక్రయించడం సాధ్యం కాదని కొనిజర్ల చింతకాని బోనకల్ మండలాల్లో ఒక్కొక్క గ్రామంలో 5000 నుంచి 20వేల టన్నుల వరకు మొక్కజొన్న దిగుబడి వచ్చి విక్రయానికి సిద్ధంగా ఉందని వాటినన్నిటిని మరొక చోటకు తరలించి అమ్ముకోవాలంటే రైతులు నరకయాతన పడే అవకాశం ఉందని మరొకవైపున అకాల వర్షాలు గాలి దుమ్ములు వస్తున్న నేపథ్యంలో రైతులకు అందుబాటులోనే కల్లాలు ఏర్పాటు చేసి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు సాగర్ ఆయకట్టు పరిధిలో వైరా పాలేరు రిజర్వాయర్ కింద వరి పంట మరో 20 రోజులు ఉండే అవకాశం ఉందని సాగర్ జలాలు ఏప్రిల్ చివరి వరకు విడుదల చేసి చెరువులు కుంటలు నింపాలని ఉన్న పంటలు ఎండిపోకుండా కాపాడాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో అనేక రెవెన్యూ గ్రామాల్లో రైతుల చేతుల్లో వారసత్వంగా ఉన్న భూములకు భూభారతి పోర్టల్ లో కూడా నిషేధిత జాబితాలో చూపించారని దీని వల్ల రైతులకు హక్కులు లేక అవసరాలకు విక్రయించుకోలేక బ్యాంకుల్లో అప్పులు కూడా తెచ్చుకోలేని పరిస్థితి ఉందని నిషేధిత జాబితాలో ఉన్న భూములను ఆ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. సాదా బైనమా దరఖాస్తులను పరిశీలించి అర్హులైన రైతులందరూ పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని కోరారు నేలకొండపల్లి బోనకల్ మండలాలను ప్రయోగాత్మకంగా రెవెన్యూ సదస్సు నిర్వహించి భూ సమస్యలు పరిష్కరిస్తామని గత జూన్ లోనే ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహించి ఇప్పటివరకు ఒక్క రైతు కూడా పట్టాదారు పాసు పుస్తకం జారీ చేయలేదని భూ సమస్యల జిల్లా వ్యాప్తంగా పెండింగ్లో ఉన్నాయన్నారు భూభారతని అమలు చేసి భూ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మొక్కజొన్న వరి ధాన్యం కొనుగోలు సమస్యలు పరిష్కారం చేసి రైతులకు న్యాయం చేయకపోతే మంత్రులు భాధ్యత వహించాలి ఉంటుంది అన్నారు, ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్ దురిశెట్టి అను దీప్ కి రైతు సమస్యలు పరిష్కారం చేయాలి అని వినతి పత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, బండి రమేష్,ఎస్ కె మీరా, దుగ్గి కృష్ణ,గొడవర్తి నాగేశ్వరరావు వాసిరెడ్డి ప్రసాద్, బిక్కు సాని గంగాధర్,దొండపాటి నాగేశ్వరరావు, రచ్చా నరసింహారావు, నల్లమోతు మోహన్ రావు, గూడ్డూరి ఉమ, సిఐటియు జిల్లా నాయకులు వై విక్రం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎర్రా శ్రీనివాసరావు,లత,సునిత, మల్లెంపాటి రామారావు, కిలారు శ్రీనివాసరావు, ప్రతాప్ నేని వెంకటేశ్వరరావు, ఉపేందర్, రమేష్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.








## వరి పంటలను పరిశీలించిన జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ధనసరి పుల్లయ్య



ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్/ ఏప్రిల్ 7( అక్షరం న్యూస్ –:
మంగళవారం నాడు జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య లింగన్నపాలెం గ్రామం నందు క్షేత్ర ప్రదర్శన జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమం లో వరి వేసిన పంట పొలాలను పరిశీలించారు. అదేవిధంగా గరికపాడు లో ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించి, రైతులకు త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం అవుతుందని చెప్పారు.మొక్కజొన్న కొనుగులు కేంద్రాలను వైరా మండలం కి 2 కేటాయించడం జరిగింది. ఇవే కాకుండా అదనపు మరో 2 సెంటర్స్ ను కేటాయించాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి మాయన మంజూఖాన్ వ్యవసాయ విస్తరణ అధికారి సైదులు లింగన్నపాలెం, గరికపాడు గ్రామ రైతులు దూదిపాల్ల కిషోర్, తోటకూర నాగేశ్వరావు, సజ్జ కృష్ణయ్య, లక్కీరెడ్డి ప్రభాకర్ రెడ్డి బొగ్గుల భాస్కర్ రెడ్డి, గోసు రాధాకృష్ణ తదితర రైతులు పాల్గొన్నారు.



## గ్రామ దీపిక హేమపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని గ్రూప్ సభ్యులు డిమాండ్..



ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్/ ఏప్రిల్ 7 (అక్షరం న్యూస్ –:
ఖమ్మం జిల్లా వైరా మండలం నారపనేనిపల్లి గ్రామంలో డ్వాక్రా గ్రూపు సభ్యుల శ్రీనిధి నగదును గ్రామ దీపిక బొల్లినేని హేమ స్వాహ చేసింది గ్రామంలో 12 గ్రూపులకు సంబంధించిన శ్రీనిధి నగదు బ్యాంకులో చెల్లించకుండా తను సొంతానికి వాడుకొని ఆరు లక్షల 79 వేల రూపాయలు నగదు స్వాహా చేసింది గ్రూప్ సభ్యులు నెల నెల కట్టిన డబ్బులు బ్యాంకుకు జమ చేయకపోవడంతో అనుమానం వచ్చిన గ్రూపు సభ్యులు గ్రామ దీపికను నిలదీయడంతో గ్రూప్ సభ్యులు కట్టిన నగదు తన కుటుంబ అవసరాలకు వాడుకున్నానని తిరిగి మరల చెల్లిస్తానని హామీ ఇచ్చింది నెలలు గడుస్తున్న అప్పు తీర్చాలని గ్రూప్ సభ్యులు ఒత్తిడి చేయడంతో సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఇంటి నుంచి వెళ్లిపోయిందని గ్రూప్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు దీంతో డ్వాక్రా గ్రూప్ సభ్యులందరూ ఐకెపి ఏపీవోకు ఫిర్యాదు చేశారు దీంతో ఐకెపి సిబ్బంది గ్రూప్ సభ్యులు శ్రీనిధి నగదు స్వాహా పై విచారణ చేపట్టారు. గ్రామ దీపిక హేమపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని గ్రూప్ సభ్యులు డిమాండ్ చేశారు.



# కార్మిక శాఖ మంత్రి గారు కాస్త కనికరించండి

- **సెక్యూరిటీ గార్డ్స్ రెండో రోజు నిరసనలు.**

మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ ఏప్రిల్ 7/ అక్షరం న్యూస్ –:

సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల కుటుంబాలు ఉపాధి కొల్పొయి రోడ్డున పడ్డాయని కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కనీసం పట్టించుకోవడం లేదంటూ ఇప్పటికైనా స్పందించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం రెండవ రోజు ర్యాలీ నిర్వహించారు. అధికారులు వెంటనే స్పందించి ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల సమస్యను పరిష్కరించకుంటే ప్రజల మద్దతు కూడగట్టి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్ ల టెండర్ రాలేదనే కారణంతో దాదాపుగా 220 కుటుంబాలు రోడ్డున పడి నెల రోజులు దాటిన చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే, కార్మిక శాఖ మంత్రి స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఓట్లు వేసి గెలిపించిన ఈ కార్మిక కుటుంబాలు నేడు ఉపాధి కోల్పోయి ఆర్థికపరంగా, మానసికంగా ఇబ్బందులు పడుతుంటే నేనున్నా అని ధైర్యం ఇవ్వాల్సిన పాలకులే నేడు స్పందించకపోవడం అంటే ఓట్లేసి గెలిపించిన ఈ కార్మిక వర్గాన్ని మోసం చ ే య ్ ం డ ్ ఎ ే ం అ వు త ం ం ద న్నా ర ం. ఇప్పటికైనా కార్మికుల దయనీయ దుస్థితిని అర్థం చేసుకొని కొత్త టెండర్ వచ్చే విధంగా, కార్మికులను ఎలాంటి షరతులు లేకుండా వీధిలోకి తీసుకునే విధంగా ఈ నియోజకవర్గ ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని 220 కుటుంబాల తరఫున సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం సిఐటియు తరపున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. అలాగే అధికారుల నిర్లక్ష్యం మూలంగా రోడ్డున పడ్డ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని జరుగుతున్న పోరాటంలో భాగంగా ఈరోజు పాల చెట్టు ఏరియాలో శాంతియుతంగా నిరసన ర్యాలీ




చేయడం జరిగిందనారు. ఇప్పటికైనా అధికారులు ప్రైవేట్ సెక్యూరిటీ కార్డులను విధులకు తీసుకునే విధంగా చర్యలు తీసుకోకపోతే ఈ పోరాటానికి ప్రజల మద్దతును కూడగట్టి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం సిఐటియుగా హెచ్చరిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మందమర్రి ఇన్చార్జిలను సత్కరించిన కాంగ్రెస్ నాయకులు



మంచిర్యాల జిల్లా/ మందమర్రి /ఏప్రిల్ 7/ అక్షర న్యూస్ – :
మందమర్రి బ్లాక్ కాంగ్రెస్ ఇంచార్జ్ గా డిసిసి వైస్ ప్రెసిడెంట్ బెల్లంకొండ కర్ణసాగర్ రావు, మందమర్రి మున్సిపాలిటీ ఇన్చార్జిగా డిసిసి సెక్రెటరీ గోపతి బానేష్ లను నూతనంగా నియమించిన అనంతరం మంగళవారం మందమర్రి పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో వీరిని ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో మందమర్రి పట్టణ అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్, ఉమ్మడి ఆదిలాబాద్ మాజీ జనరల్ సెక్రటరీ సొతుకు సుదర్శన్, మండల అధ్యక్షులు కడారి జీవన్ కుమార్, సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి పాషా, మైనారిటీ నాయకులు జమీల్, సీనియర్ నాయకులు ఎర్ర రాజు, బుర్ర ఆంజనేయులు, రాచర్ల గణేష్, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు మాయ తిరుపతి, సేవాదళ్ పట్టణ అధ్యక్షులు సొతుకు ఉదయ్ కుమార్, యువజన నాయకులు రాయబారపు కిరణ్, మూడారపు శేఖర్ లు పాల్గొని శాలువాతో సన్మానించి స్వీట్స్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు

## కళ్యాణి ఖని ఓసీపీ లో కార్పొరేట్ జీఎం (సేఫ్టీ) పర్యటన



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ ఏప్రిల్ 7/ అక్షరం న్యూస్ – :
సింగరేణి సంస్థ కార్పొరేట్ జీ.ఎం (సేఫ్టీ) సాయిబాబు మంగళవారం మందమర్రి ఏరియాలోని కేకే ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ ను ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గని లోపలికి వెళ్లి క్వారీలో జరుగుతున్న బొగ్గు ఉత్పత్తి, ఓవర్ బర్డెన్ తొలగింపు పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. గనిలో ప్రస్తుత పనితీరును సమీక్షించిన అనంతరం, అధికారులకు మరియు కార్మికులకు ఆయన పలు భద్రతా సూచనలు చేశారు. ఉత్పత్తి కంటే రక్షణకే ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి ఉద్యోగి భద్రతా నియమాలను తూచా తప్పకుండా పాటించాలని ఆయన స్పష్టం చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా గనిలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. పర్యటనలో శ్రీ సాయిబాబు గారితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఎన్. రాధాకృష్ణ -- జీ ఎం, మందమర్రి ఏరియా. కె. రఘుకుమార్ -- జీ.ఎం (సేఫ్టీ), బీ.పీ.ఏ రీజియన్. లలితేంద్ర ప్రసాద్ -- ఎస్.ఓ టూ జీ.ఎం. ఎం. మల్లయ్య -- ప్రాజెక్ట్ ఆఫీసర్ (పి. ఓ), కే.కే ఓ.సీ.పీ. ఎన్.. పైడయ్య – సేఫ్టీ ఆఫీసర్ కేకే.ఓ.సి.పి ఎన్. వెంకట వంశీధర్ -- ప్రాజెక్ట్ ఇంజనీర్ శ్రీధర్ గౌడ్ -- ఇన్‌చార్జ్ మేనేజర్. ఈ పర్యటనలో గని అధికారులు మరియు భద్రతా విభాగం సిబ్బంది పాల్గొని క్వారీలోని ప్రస్తుత పరిస్థితులను జీ.ఎం గారికి వివరించారు.

## కార్మికుల ఆరోగ్య సంరక్షణే సింగరేణి ధ్యేయం

- **వేసవి జాగ్రత్తలపై కార్మికులకు అవగాహన.**



మంచిర్యాల జిల్లా/మందమర్రి/ఏప్రిల్ 7/ అక్షరం న్యూస్ – :
సింగరేణిలో విధులు నిర్వహించే ఉద్యోగులు మరియు కార్మికుల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా సింగరేణి సంస్థ పనిచేస్తుందని, ఆరోగ్య అధికారి డాక్టర్ పి.లోక్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధకృష్ణ, డివై సీఎమ్ఓ మధుకుమార్, గార్ల ఆదేశానుసారం, కెకె–5 గని పై ఉద్యోగులకు వేసవి జాగ్రత్తలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లోక్నాథ్ రెడ్డి మాట్లాడుతూ ఎండ తీవ్రత వల్ల కలిగే వడదెబ్బ లక్షణాలను వివరించారు. ఒకవేళ వడదెబ్బకు గురైతే తీసుకోవాల్సిన తక్షణ ప్రథమ చికిత్స గురించి కార్మికులకు క్షుణ్ణంగా వివరించారు. ఎండలు మండిపోతున్న దృష్ట్యా ప్రతి ఒక్కరూ నిరంతరం ద్రవ పదార్థాలను (మంచినీరు, ఓఆర్ఎస్, మజ్జిగ) తీసుకోవాలని సూచించారు.ఆరోగ్యాన్ని దెబ్బతీసే మద్యపానం మరియు ధూమపానానికి ఈ వేసవి కాలంలో ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని ఆయన హెచ్చరించారు. గని మేనేజర్ శంభూనాథ్ పాండే, సేఫ్టీ ఆఫీసర్ చీకటి రమేశ్ మాట్లాడుతూ గనిపై పనిచేసే కార్మికులు అధికారుల సూచనలు పాటించి, ఆరోగ్యంగా ఉండాలని కోరారు. రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించడంలో ఆరోగ్యం కీలకమని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గని సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఏ. రవళి, యూనియన్ల నాయకులు మరియు ఉద్యోగులు పాల్గొన్నారు.

## వర్క్ షాప్ లో ఐ.ఎన్.టి.యూ.సి బాయి బాట



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ ఏప్రిల్ 7/ అక్షరం న్యూస్ –:
మందమర్రి ఏరియాలో గల వర్క్ షాప్ లో ఐఎన్టియుసి ఏరియా ఉపాధ్యక్షులు దేవి భూమయ్య అధ్వర్యం లో కార్మికులను కలిసి వారి సమస్యలు తెలుసుకోన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టెక్నికల్ స్టాఫ్ కి సరైన టూల్స్ లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. అలాగే అవుట్ డోర్ వర్క్ లకు వెళ్లే కార్మికులకు కన్వియన్స్ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కన్వియన్స్ కొరకు కార్మికులు అడుగుతే కొందరు కింద స్థాయి అధికారులు కార్మికులను బెదిరిస్తూ మాట్లాడుతున్నారని తెలిపారు. వర్క్ షాప్ కార్మికుల సమస్యలు పై అధికారులతో మాట్లాడి పరిష్కరించడానికి ఐఎన్టీయూసీ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాంశెట్టి నరేందర్, ఏరియా సెక్రటరీ దోరిశెట్టి చంద్రశేఖర్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ రాజేందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఓరం మదు, వేముల సత్తన్న, నాయకులు ఆకుల బాలకృష్ణ, తోట నర్సయ్య, పర్లాళి రమేష్, సదానందం, రెడ్డి ప్రభాకర్, రాజ్ కుమార్, నీలం శ్రీనివాస్, పురేళ్ళ నరేందర్ పాల్గొన్నారు.

## ఐటీ కారిడార్ లో హైడ్రా భారీ ఆపరేషన్

**12 వందల కోట్ల విలువైన 8 ఎకరాలు స్వాధీనం**

హైదరాబాద్,ఏప్రిల్7 ఐటీ కారిడార్ లో హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది . మంగళవారం ఖానామెట్ లో రూ. 12 వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చెర నుంచి కాపాడింది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి..ఐటీ కారిడార్ కు చేరువలోని ఖానామెట్ లో 8 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించింది హైడ్రా. స్థానికుల ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు ఆక్రమణల కూల్చివేత చేపట్టారు. హైడ్రా కాపాడిన ప్రభుత్వ భూమి విలువ సుమారు రూ. 12 వందల కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు అధికారులు. ఖానామెట్ లోని సర్వే నంబర్ 55లో ఉన్న ప్రభుత్వ భూమిలో భారీ ఆపరేషన్ చేపట్టారు హైడ్రా అధికారులు. ఈ స్థలంలో తాత్కాలిక షెడ్లు, నిర్మాణాలు తొలగించారు హైడ్రా అధికారులు. హైడ్రా వార్నింగ్ తో ఆర్‌సీసీ ప్లాంట్‌ను స్వయంగా తొలగించింది ప్రభుత్వ భూమిని ఆక్రమించిన నిర్మాణ సంస్థ. ప్రభుత్వ భూమిలో కార్మికుల కోసం ఏర్పాటు చేసిన షెడ్లను తొలగించిన హైడ్రా.. మొత్తం భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. ప్రభుత్వ భూమిగా బోర్డులు ఏర్పాటు చేసి..అసైన్డ్ ల్యాండ్‌గా గుర్తించి, ప్రొహిబిటెడ్ లిస్ట్‌లో నమోదు చేసినట్లు తెలిపారు అధికారులు. రియల్ ఎస్టేట్ సంస్థల తప్పుడు ÷–లకెయిమ్‌లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు అధికారులు.

## ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ ఆస్పత్రుల సమ్మె విరమణ

అమరావతి,ఏప్రిల్7 ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలోని స్పెషాలిటీ ఆసుపత్రుల్లో జరుగుతున్న సమ్మెను విరమించినట్లు స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్ ప్రకటించింది. ప్రభుత్వం కొద్దిసేపటి క్రితం ఇచ్చిన హామీల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అసోసియేషన్ తెలిపింది. 10 రోజుల్లో వెయ్యి కోట్ల రూపాయలు చెల్లిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని ఆమోదించి సమ్మెను విరమించినట్లు ఆసుపత్రుల యాజమాన్య సంఘం ప్రకటించింది. 10 రోజుల్లో బకాయిలు చెల్లించని పక్షంలో మళ్లీ వైద్య సేవలను పూర్తిగా నిలిపివేస్తామని అసోసియేషన్ హెచ్చరించింది. ప్రభుత్వంతో జరిపిన చర్చల సమావేశం మినిట్స్‌ను కూడా కొద్ది సేపటి క్రితం అసోసియేషన్‌కు అధికారులు పంపించారు. ఈ మినిట్స్‌లో ఇచ్చిన హామీలు, చర్చల వివరాలు స్పష్టంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సమ్మె విరమణతో ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింది అన్ని సేవలు పునఃప్రారంభం కానున్నాయి.

## ఎసిబికి చిక్కిన అగ్రి వర్సిటీ అసోసియేట్ డీన్

హైదరాబాద్,ఏప్రిల్7 ఎన్ని దాడులు జరుగుతున్నా లంచావతారాలు మారడం లేదు. నిత్యం ఎక్కడో చోట లంచగొండులు పట్టుబడుతూనే ఉన్నారు. ఆచార్య జయశంకర్ అగ్రికల్చర్ వర్సిటీ అసోసియేట్ డీన్ గోవర్ధన్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు. ఒక విత్తన కంపెనీ నుంచి రూ.లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. ఈ క్రమంలో రాజేంద్రనగర్‌లోని అగ్రికల్చర్ కళాశాలతో పాటు, ఎల్బీనగర్‌లోని గోవర్ధన్ ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు.

## పశ్చిమాసియా యుద్ధ ప్రభావం

**ఇప్పటి వరకు పదివేల విమాన సర్వీసుల రద్దు**

న్యూఢిల్లీ,ఏప్రిల్7 పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్ నుంచి ఆ ప్రాంతానికి వెళ్లే విమాన సర్వీసులను దేశీయ విమానయాన సంస్థలు రద్దు చేస్తున్నాయి. యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు 10 వేలకు పైగా విమాన సర్వీసులు రద్దయినట్లు పౌరవిమానయాన శాఖ వెల్లడించింది. పశ్చిమాసియాకు భారత్ నుంచి రోజుకు 300 నుంచి 350 వరకు విమాన సర్వీసులు నడుస్తుంటాయి. ఘర్షణల కారణంగా ఆ సంఖ్య 80–90కి పడిపోయిందని పేర్కొంది. మరోవైపు.. సుదూర విమాన ప్రయాణాలకు సంబంధించి పైలట్ల 'ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్'ను డీజీసీఏ తాత్కాలికంగా సడలించింది. విమాన కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూసుకునేందుకే ఈ నిర్ణయమని మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

## మొక్క కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఖమ్మం,ఏప్రిల్7 కూసుమంచి మండలంలోని జీర్ల చెరువులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రఘురాంరెడ్డి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి రైతు నుంచి మొక్కజొన్నను కొనుగోలు చేయనున్నట్లు ఆయన చెప్పారు. చేగుమ్మ సహకార సంఘం పరిధిలోని పలు గ్రామాల్లో ఉప కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోళ్లను ముమ్మరం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి గంగాధర్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సొంత బంధువుల ఘాతుకం

**బంగారం కోసం వృద్ధురాలి హత్య**

విజయనగరం,ఏప్రిల్7 బంగారానికి ఆశపడి సొంత బంధువులే ఓ వృద్ధురాలిని చంపి చెరువులో పాతిపెట్టిన ఘటన పోలీసుల దర్యాప్తులో వెలుగుచూసింది. మంగళవారం స్థానిక వివరాల మేరకు .. చీపురుపల్లి మండలం గొల్లపాలెం గ్రామంలో గొర్లె చిన్నప్పమ్మ (65) ను అదే గ్రామానికి చెందిన ఆమె మేనల్లుడు వరుసైన ఎజ్జుపొరపు రమణ, చందక రమణ అనే ఇద్దరు వ్యక్తులు కలిసి ఆమె బంగారానికి ఆశపడి చంపేసినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 23వ తేదీన వృద్ధురాలిని గొల్లపాలెం గ్రామానికి సమీపంలో గల ఒక చెరువులో పాతిపెట్టారు. దీంతో మృతురాలి అల్లుడు రెడ్డి పాపునాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ కేసును ఛేదించారు. ఈ క్రమంలో స్థానిక పోలీసులతోపాటు విజయనగరం, విశాఖపట్నం నుండి ఆర్ ఎఫ్ ఎస్ ఎల్ టీంలు, క్లూస్ టీంలు డి.ఎస్.పి ఎస్ రాఘవులు, సీఐ శంకర్రావుల ఆధ్వర్యంలో సంఘటన స్థలానికి చేరుకొని అక్కడ తవ్విచూడగా వృద్ధురాలి మృతదేహం కనిపించింది. ఈ సంఘటనకు సంబంధించి ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.


## మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్తత

**నిరసనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణ**

ఇంఫాల్,ఏప్రిల్7 మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్తపరిస్థితులు నెలకొన్నాయి. బిష్ణుపూర్‌జిల్లాలో నిరసనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణ చెలరేగినట్లు అధికారులు మంగళవారం తెలిపారు. ఆగ్రహించిన పోలీసులు ఆందోళనకారులపై కాల్పులకు దిగారని అన్నారు. మంగళవారం తెల్లవారుజామున మొయిరాంగ్ ట్రోంగ్లాబి ప్రాంతంలో ఒక నివాసంపై అనుమానిత వ్యక్తులు జరిపిన బాంబుదాడిలో ఐదేళ్ల బాలుడు, ఆరు నెలల చిన్నారి మరణించగా, తల్లికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనపై ఆగ్రహించిన గ్రామస్తులు ఇంఫాల్ సహా పలు ప్రాంతాల్లో ఆందోళన చేపట్టారు. రహదారులను దిగ్బంధించారు. ఈ ప్రాంతంలో పెట్రోల్ బంక్ సమీపంలోని రెండు ఆయిల్ ట్యాంకర్స్, ట్రక్‌కు నిప్పటించారు. మోయిరాంగ్ పోలీస్ స్టేషన్ సహా ఇంఫాల్ ఈస్ట్, ఇంఫాల్ వెస్ట్ జిల్లాల్లో టైర్లను తగుల బెట్టి నిరసన వ్యక్తం చేశారు. బిష్ణుపూర్ జిల్లాలోని కేంద్ర బలగాల శిబిరంపై దాడి చేశారు. ట్రోంగ్లాయోబికి సుమారు 200 మీటర్ల దూరంలో ఈ శిబిరం ఉంది. ఆగ్రహించిన పోలీసులు వారిపై కాల్పులకు దిగడంతో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు.

# రాజకీయం కోసం అభివృద్ధికి మోకాలడ్డరాదు !





హైదరాబాద్,ఏప్రిల్ 7 రాజకీయాలు వేరు..అభివృద్ధి వేరు. ఈ రెంటిని కలగలిపి చూస్తే..అభివృద్ధి వెనక్కి పోతుంది. తెలంగాణలో మూసీ ప్రక్షాళన విషయంలో ఇదే జరుగుతోంది. ఎపిలో అమరావతి విషయంలనూ ఇదే కనిపిస్తోంది. తెలంగాణలో మూసీ ప్రక్షాళన చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి పట్టుదలతో ఉన్నారు. ఇప్పుడు చూపిన నమూనా ప్రకారం ముందుకు వెళితే మంచిదే. అదేవిధంగా నిర్వాసితులకు ఉత్తమ ప్యాకేజీ, వారు ఆనందపడిపోయేలా ఉండాలి. ఇల్లుకు ఇల్లు, జాగాకు జగా అందాలి. మూసీని ప్రక్షాళన చేయడంలో ఎవ్వరికీ అభ్యంతరం ఉండదు. అలాగే మురుగనీటిని ఎలా, ఎక్కడికి తరలిస్తారన్నది కూడా పెద్ద సమస్య. హైదరాబాద్ మురుగునీటిని ఇంతకాలం మూసీలో పారబోస్తున్నారు. దానికి ప్రత్యామ్నాయం చూపాలి. ఇకపోతేమూసీ ప్రక్షాళనను వ్యతిరేకిస్తున్న బిఆర్ఎస్, బిజెపిలు ప్రత్యామ్నాయాలు చూపడం లేదు. ఇలా చేద్దామని సలహాలు ఇవ్వడం లేదు. ఎందుకంటే ఇది రాజకీయం. రాజకీయాన్ని అభివృద్ధితో ముడిపెట్టడం వల్లనే మూసీ ప్రక్షాళనను ఈ రెండు పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. పదేళ్లు పాలించిన బిఆర్ఎస్ తెలంగాణ అడుక్తికునేలా చేసింది. ఇలాంటి రాజకీయాల వల్లనే తెలంగాణ మరింత వెనకబాటుకు గురవుతుంది. ఇకపోతే అమరావతి విషయంలో జగన్, ఆయన అనుచరగణం చేస్తున్న విమర్శలు, రాజకీయాలు చూస్తుంటే..ఇలాంటి నాయకులు ఉన్నందుకు సిగ్గుపడాలి. అమరావతి రాజధాని నిర్మాణం అవసరం. కానీ అసలు రాజధానే అవసరం లేదంటున్న వారు రాజకీయాల్లో ఉండడానికి లేదు. 2019 ఎన్నికల్లో 151 సీట్ల భారీ మెజారిటీని జగన్ మోహన్ రెడ్డికి కట్టబెడితే చేసిందేమిటి. ఆనాడు మావిగన్ ఆలోచన ఎందుకు రాలేదు. ఆనాడు మడు రాజధానులంటూ ఎందుకు ఊరేగారు. రాజధాని అవసరం లేదన్న వారు ఐదేళ్లు కాలయాపన చేశారు. అప్పటి నుంచి జగన్ రాజకీయ నిజస్వరూపం వెల్లడవుతూ వచ్చింది. ప్రజలకు ఆయన ఏమిటో బోధ పడింది. కక్షలు, కార్పణ్యాలు, అసూయా ద్వేషాలతో ఐదేళ్లపాటు సాగించిన పాలనతో ప్రజలకు చైతన్యం వచ్చి ఉండాలి. ఎందుకంటే ఇలాంటి నేతను మోసినందుకు సిగ్గుపడాలి. రాజకీయాల్లో వైఫల్యాలను గుణపాఠాలుగా మలచుకొని ముందుకు సాగాలి. కానీ ఇక్కడ బిఆర్ఎస్, అక్కడ జగన్ పార్టీకి ఇవేవీ కానరావడం లేదు. ఇప్పటికీ ఈ రెండు పార్టీల నేతలకు జ్ఞానోదయం కావడం లేదు. వారికి కావలసిం దల్లా అధికార పీటం తప్ప, అభివృద్ధి కాదు. భజనపరులు చుట్టూ ఉంటే అధికారంలో ఉన్నప్పుడు ప్రజా వ్యతిరేకత కనిపించదు. ప్రజలకు డబ్బు పంచితే గంపగుత్తగా ఓట్లు పడతాయని లెక్కలు వేసుకున్న నేటి విపక్ష నేతలు ఆనాడు మళ్లీ తమదే అధికారం అని ధంకా బజాయించారు. అందుకే అధికారంలో ఉన్నప్పుడు ఒళ్లు దగ్గర పెట్టుకుని పాలన చేయాలి. ఇప్పుడు రేవంత్ రెడ్డి అయినా అదే చేయాలి. ఎందుకంటే భూకబ్జాలపై వస్తున్న ఆరోపణలపై మేల్కోవాలి. వెంటనే ఖండించాలి. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆయన తనయుడిపై విపరీతమైనా ఆరోపణలు ఉన్నాయి. వీటిని ఖండించకపోవడంతో అనుమానాలు మరింతగా బలపడుతున్నాయి. రేవంత్ ఇలాంటి విషయాలపై ఖచ్చితంగా లేకుంటే వచ్చే ఎన్నికల్లో ఆయన కూడా మూసీలో కొట్టుకు పోవడం ఖాయం.

నిర్మాణాత్మక పనులు ఇంకా రేవంత్ మొదలు పెట్ట లేదు. ఎంతసేపు రేషన్ కార్డులు, సన్నబియ్యం, చీరలు, ఫ్రీ బస్సు వంటివే కనిపిస్తున్నాయి. ఇవేవీ అభివృద్ధి కాదని గుర్తించాలి. ఇకపోతే ఆనాడు వైనాట్ 175 అన్న జగన్ ఇప్పుడు మళ్లీ మనదే అధికారం అంటున్నారు. తెలంగాణలో కెటిఆర్ కూడా అదే మాట్లాడుతున్నారు. ఎపిలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తికావస్తోంది. ఇంకేముందీ ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని, ఇక ఉన్నది రెండేళ్ల కాలమని, చివరి సంవత్సరం అంతా ఎన్నికలకే పోతుందని, తన పాదయాత్ర కూడా ఉంటుందని జగన్ నమ్మబలుతుకున్నారు. అధికారంలో ఉన్నప్పుడు చేసిన అరాచకాలను ప్రజలు మరచిపోరని ఏ పార్టీ అయినా గుర్తించాలి. అధజకారంలో ఉన్నప్పుడు జగన్‌కు మావిగన్ ఆలోచన రాలేదు. అంటే అమరావతి మీద ద్వేషంతో చేస్తున్నదే అని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. మహా నగరాలతో 'మావిగన్' పోటీ పడుతుందని ప్రచారం కూడా మొదలెట్టారు. రాజ్యాంగంలో రాష్ట్రాలకు రాజధాని అనే పదం లేదని జగన్ చెప్పడం చూస్తుంటే, ఇలాంటి వ్యక్తిని ఎందుకు ఆదరించాలో ప్రజలు కూడా ఆలోచించాలి. హైదరాబాద్ మహా నగరం నుంచి వస్తున్న ఆదాయంతోనే తెలంగాణ నడుస్తోంది. ఇప్పుడు రేవంత్ ఫ్యూచర్ సిటీ అంటున్నారు. ఇది సాధ్యామా అన్నది కూడా ఆలోచించాలి. నగరాలు వాటంతటే అవే రావాలి తప్ప, చేస్తే రావు. అరావతి వేరు...ఫ్యూచర్ సిటీ వేరు అని గుర్తించాలి. ఆంధ్రప్రదేశ్‌కు ప్రస్తుతం విశాఖపట్నం నుంచి అధికంగా ఆదాయం వస్తోంది. అమరావతి మహా నగరంగా అభివృద్ధి చెందితే రాష్ట్ర ఆదాయం గణనీయంగా పెరుగుతుంది. రైతులు ఇచ్చిన భూములను అభివృద్ధి చేసి, అందులో కొంత భాగాన్ని విక్రయించి ఆ డబ్బుతో మౌలిక వసతులు కల్పించబోతున్నారు. హైదరాబాద్ ఇప్పటి రూపం సంతరించుకోవడానికి మూడు దశాబ్దాలకు పైగా పట్టింది. అభివృద్ధి అనేది నిరంతర పక్రియ. సంకుచితంగా ఆలోచించేవారు అభివృద్ధి గురించి ఆలోచించలేరు. అందుకే రాజకీయాలు వేరు. అభివృద్ది వేరు. రాజకీయ పార్టీల నేతలకు దూరదృష్టి ఉండాలి. అభివృద్దిపై అవగాహన ఉండాలి. వందేళ్ల ముందు గురించి ఆలోచించాలి. అంతేగాని రాజకీయాలతో వెనకేసుకుని బతుకుదామనుకునే వారు పాలకులు కాబోరు.

# అంతర్జాతీయంగా అనిశ్చితి


- ఒడిదుడుకుల్లో స్టాక్ మార్కెట్లు
- నష్టాలతో ప్రారంభం అయిన దేశీయ మార్కెట్లు



ముంబయి,ఏప్రిల్7 అంతర్జాతీయ పరిస్థితుల అనిశ్చితి, ముఖ్యంగా పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యం లో దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాలతో ప్రారంభమయ్యాయి. ఉదయం ట్రేడింగ్‌లో కీలక సూచీలు క్షీణించాయి. ఉదయం 9:24 గంటల సమయానికి సెన్సెక్స్ సుమారు 529 పాయింట్లు పడిపోయి 73,576 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 155 పాయింట్లు నష్టపోయి 22,813 వద్ద కొనసాగింది. ప్రారంభ దశలో సెన్సెక్స్ 700 పాయింట్లకు పైగా పడిపోవడం గమనార్హం. నిఫ్టీ సూచీలో హిందాల్కో, ఓఎన్‌జీసీ, విప్రో, కోల్ ఇండియా, బజాజ్ ్గ÷నాన్స్ షేర్లు లాభాల్లో నిలిచాయి. మరోవైపు ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, మ్యాక్స్ హెల్త్‌కేర్, ఎటర్నల్, ఐషర్ మోటార్స్, ఎంఅండ్‌ఎం షేర్లు నష్టాలను చవిచూశాయి. ఇక అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు విధించిన గడువు ముగియడానికి సమయం దగ్గర పడుతుండటంతో గ్లోబల్ మార్కెట్లలో ఉద్రిక్తత నెలకొంది. హర్మూజ్ జలసంధి అంశంపై పరిస్థితులు ఎలాంటి మలుపు తిరుగుతాయోనన్న అనిశ్చితి పెట్టుబడిదారులను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ ప్రభావంతో ముడి చమురు ధరలు పెరుగుతూ బ్యారెల్‌కు 110 డాలర్లకు పైగా కొనసాగుతున్నాయి. ఇదే సమయంలో రూపాయి విలువ కూడా బలహీనపడి డాలర్‌తో పోలిస్తే 93.07 వద్ద ట్రేడవుతోంది. మొత్తంగా, గ్లోబల్ టెన్షన్స్, చమురు ధరల పెరుగుదల దేశీయ మార్కెట్లపై ఒత్తిడిని పెంచుతున్నాయి. గత మూడు ట్రేడింగ్ సెషన్లలో లాభాలను ఆర్జించిన దేశీయ సూచీలు మంగళవారం నష్టాలతో ప్రారంభమయ్యాయి. సోమవారం విదేశీ మదుపర్లు రూ. 8 వేల కోట్లకు పైగా విలువైన షేర్లు అమ్మేశారు. అలాగే హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరిచేందుకు ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన గడువు సమీపిస్తున్న వేళ పశ్చిమాసియా యుద్ధం ఏ క్షణాన ఏ మలుపు తీసుకుంటుందోననే ఆందోళన నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తమయ్యారు. ఈ ఆందోళన కారణంగా అంతర్జాతీయ మార్కెట్లు కూడా నష్టాల్లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ నష్టాల్లో కదలాడుతున్నాయి. మంగళవారం ఉదయం దాదాపు 400 పాయింట్ల నష్టంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరో 500 పాయింట్లు కోల్పోయింది. ఆ తర్వాత కాస్త కోలుకుంది. ప్రస్తుతం ఉదయం 10:50 గంటల సమయంలో సెన్సెక్స్ 354 పాయింట్ల నష్టంతో 73,752 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా నష్టాల బాటలోనే సాగుతోంది. సెన్సెక్స్, నిఫ్టీలో వేదాంత, హిందోల్కా, ప్రెస్టేజ్ ఎస్టేట్, విప్రో, ఎంఫసిస్ మొదలైన షేర్లు లాభాల్లో ఉన్నాయి. జుబిలెంట్ ఫుడ్స్, ఫోర్స్ మోటార్స్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్, పీజీ ఎలక్ట్రోప్లాస్ట్ మొదలైన షేర్లు నష్టాల బాటలో సాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 266 పాయింట్ల నష్టంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 563 పాయింట్ల నష్టంతో ఉంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 92.93గా ఉంది.

# చేనేతలకు ఉచిత విద్యుత్ హామీ అమలు

**చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే**



అనంతపురం,ఏప్రిల్7 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు చేనేతలకు ఉచిత విద్యుత్ అమలు చేసిన ఘనత సీఎం చంద్రబాబుకు దక్కుతుందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. చేనేత కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎన్జీవో హోంలో కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతగా సభలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చేనేతల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇందులో భాగంగానే చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. రాబోయే కాలంలో చేనేతల అభివృద్ధికి మరింత బాధ్యతగా పనిచేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను చేనేత నాయకులు సన్మానించారు.

## కోమాలో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ

టెహ్రాన్,ఏప్రిల్7 ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ చాలా రోజుల నుంచి కోమాలో ఉన్నారన్న వార్త ఇప్పుడు ప్రపంచమంతా దావానలంలా వ్యాపిస్తోంది. ప్రస్తుతం ఖోమ్ నగరంలో చికిత్స పొందుతున్నారని కోడై కూస్తోంది. ఇరాన్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలలో మొజ్తాబా ప్రమేయం ఏమీ లేదని అంతర్జాతీయ మీడియా అంటోంది. మొజ్తాబా ప్రస్తుతం అపస్మారక స్థితిలో ఉన్నట్టు అమెరికా- ఇజ్రాయెల్ దేశాల నిఘా సంస్థలకు తెలుసని అంతర్జాతీయ మీడియా పేర్కొంది. మొజ్తాబా తీవ్ర అనారోగ్యంతో ఉన్నందువల్ల నిర్ణయాలు తీసుకోలేని స్థితిలో ఉన్నారని తెలిపింది అమెరికా-ఇజ్రాయెల్ దాడిలో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతొల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దీంతో ఆయన కుమారడు మొజ్తాబా ఖమేనీని తదుపరి సుప్రీం లీడర్‌గా ఎన్నుకున్నారు. సుప్రీం లీడర్ అయిన తర్వాత కూడా మొజ్తాబా ఎక్కడా కనిపించలేదు. మొజ్తాబా తీవ్రంగా గాయపడ్డారని, ప్రాణాలు కూడా కోల్పోయి ఉండొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అప్పట్లో అన్నారు. ఖమేనీని చికిత్స నిమిత్తం రష్యాలోని మాస్కోకు తరలించారని కూడా వార్తలు వచ్చాయి. ÷రిజ్తాబా ఖమేనీ ఇరాన్‌లోనే ఉన్నారని, బయటకు వెల్లడించలేని కారణాల వల్ల ఆయన బహిరంగంగా కనిపించడం లేదని రష్యా రాయబారి తెలిపారు . కాగా, మొజ్తాబా ఖమేనీ ఆరోగ్యంపై వచ్చిన ఈ వార్తలు ఇరాన్ రాజకీయాల్లో కీలక మార్పులకు దారి తీసే అవకాశం ఉంది. అయితే ఇప్పటివరకు ఇరాన్ ప్రభుత్వం లేదా అధికార వర్గాలు ఈ వార్తను అధికారికంగా ధ్రువీకరించలేదు. అందువల్ల ఇప్పటికి ఇవి కేవలం నివేదికల ఆధారంగా వచ్చిన సమాచారం మాత్రమే.

## వలస కార్మికులకు కేంద్రం శుభవార్త

- ఇక నుంచి 5 కెజీల రెండు సిలిండర్ల సరఫరా
- రాష్ట్రాలకు సూచించిన కేంద్రం

న్యూఢిల్లీ,ఏప్రిల్7 వలస కార్మికులకు కేంద్రం ఊరట కలిగించింది. వారికి గ్యాస్ సరఫరాపై పెట్రోలియం మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. వలస కార్మికులకు 5 కేజీల ఎఫ్‌టీఎల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా రెట్టింపు చేయాలని రాష్ట్రాలను కేంద్రం కోరింది. ఈ మేరకు పెట్రోలియం శాఖ కార్యదర్శి నీరజ్ లేఖ రాశారు. ఓఎంసీల సహాయంతో పౌర సరఫరాల శాఖ ద్వారా గ్యాస్ పంపిణీ చేయాలని సూచించారు. ఎల్‌పిజి గ్యాస్ కొరత వల్ల దేశంలో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వలస కార్మికుల సంగతి సరేసరి. ఈ నేపథ్యంలో వలస కార్మికులని దృష్టిలో ఉంచుకుని రోజుకి 5 కేజల గ్యాస్ సిలిండర్ అడ్రస్ ప్రూఫ్ లేకుండా.. ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు చూపించి కొనుగోలు చేయవచ్చని ఇటీవల కేంద్రం ప్రకటించింది. ఐదు కేజీల గ్యాస్ సిలిండర్ సమీపంలో ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్ల దగ్గర అందుబాటులో ఉంటుందని పెట్రోలియం శాఖ తెలిపింది. తాజాగా మంగళవారం వలసకార్మికులకు ఇచ్చే గ్యాస్ సిలిండర్ల సంఖ్యను కేంద్రం డబుల్‌కి పెంచింది. అంటే వలస కార్మికులు రోజుకి రెండు ఐదు కేజీల ఎల్‌పిజి సిలిండర్లను కొనుగోలు చేసేందుకు మంత్రిత్వశాఖ వీలు కల్పించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు మంత్రిత్వశాఖ లేఖ రాసింది. మార్చి 21వ తేదీన రాష్ట్రాల చీఫ్‌లకు రాసిన లేఖలో వలస కార్మికులకు ఐదు కేజీ సిలిండర్‌లను ఓఎంసి (ఆయిల్ మార్కెటింగ్ కంపెనీస్)ల సహాయంతో ఇవ్వాలని లేఖ రాసింది. అయితే ఈ లేఖలో రాసిన దానికంటే 20 శాతం పరిమితికి మించి పెంచడం జరిగిందని, వలస కార్మికులకు సిలిండర్లను అందుబాటులో ఉంచాలని పెట్రోలియం శాఖ తాజాగా రాష్ట్రాలకు రాసిన లేఖలో పేర్కొంది.

## ఆటోల ఎల్పీజీకి కొరత రాకూడదు

**ఎల్పీజి సరఫరా కంపెనీతో కమిషనర్ సమీక్ష**



హైదరాబాద్,ఏప్రిల్7 ఆటో ఎల్పీజీ తెప్పించి బంకుల్లో ఎక్కడా కొరత లేకుండా చూడాలని కంపెనీలకు తెలంగాణ పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. గత వారం రోజులుగా కంపెనీలు మంచి పనితీరు కనబరిచా యని తెలిపారు. మంగళవారం హైదరాబా ద్‌లో ఆటో ఎల్పీజీ సరఫరా చేసే ప్రైవేట్ మార్కెటింగ్ కంపెనీలతో కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. గత వారం రోజుల్లో మొత్తం 363 మెట్రిక్ టన్నుల ఆటో ఎల్పీజీని తెప్పించి సరఫరా చేశారని వివరించారు. మూతపడిన 17 బంకులను మళ్లీ తెరిపించారని పేర్కొన్నారు. గ్యాస్ సరఫరాను పెంచి, మూతపడిన బంకులను మళ్లీ తెరిపించడంలో సూపర్ గ్యాస్ (÷ూబూ।స ఉజీబ), గో గ్యాస్ (ఉనీ ఉజీబ), టోటల్ ఎనర్జీస్ (÷ునీబిజీ ఇని।సణతి।బ), ప్రైమ్ ఫ్యూయల్ (ఖసతిప। ఈబీ।) కంపెనీలు చేసిన కృషిని ఈ సందర్భంగా కమిషనర్ అభినందనలు తెలిపారు. పని తీరు ఏ మాత్రం మెరుగు పరుచుకోని పలు కంపెనీల పట్ల ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆటో ఎల్పీజీని అధికంగా తెప్పించి, బంకులన్నింటిలో సరఫరా చేయాలని కంపెనీలకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆటో డ్రైవర్ల ఉపాధి దెబ్బతినకుండా ఉండాలంటే ఆటో ఎల్పీజీ సరఫరా ఆగకుండా చూడాలని ఆయిల్ కంపెనీలకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో ఆటో గ్యాస్ కొరత రాకుండా ఉండేందుకు చర్యలు చేపట్టామన్నారు. బంకులకు గ్యాస్ వస్తున్న లెక్కలను పౌరసరఫరాల శాఖ ప్రతి రోజు పర్యవేక్షిస్తుందని కమిషనర్ స్టీఫెన్ రవీందర్ వెల్లడించారు. ఏదైనా సమస్య ఉంటే హెల్ప్ లైన్ 1967కు ఫోన్ చేయాలని సూచించారు.

## మీడియా సంస్థలపై దాడులు సరికాదు: రామ్


హైదరాబాద్,ఏప్రిల్7 ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంస్థల మీద వైసీపీ నేతలు చేసిన దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు పేర్కొన్నారు. ప్రజస్వామ్యంలో మీడియాపై దాడులు చేయడం సరైన పద్ధతికాదన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో కేసీఆర్ హయాంలో ఉన్నప్పుడు ఇదే తరహా దాడులు చేసేవారని ప్రస్తావించారు. రాజకీయ విమర్శలు ఉంటే రాజకీయంగా చూసుకోవాలని.. బెదిరింపు ధోరణి సరికాదన్నారు. బాధ్యతాయుతమైన సంస్థపై వైసీపీ నేతలు చేసిన దాడిని ఖండిస్తున్నామని రామచందర్ రావు పేర్కొన్నారు.

## దేవాదాయ శాఖ కమిషనర్ శాంతి అరెస్ట్

ఆదాయానికి మించి ఆస్తుల కేసులో ఎసిబి చర్యలు

విజయవాడ,ఏప్రిల్7 ఏపీ దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కాళింగిరి శాంతి అరెస్టయ్యారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు అందిన ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు.. తాడేపల్లి, ఉండవల్లి సహా 4 ప్రాంతాల్లో మంగళవారం ఏకకాలంలో సోదాలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా భారీగా అక్రమ ఆస్తులను గుర్తించారు. విశాఖ ఎండాడలో లగ్జరీ ఎ÷-లాట్, తాడేపల్లి కుంచనపల్లిలో జీ ప్లస్ 2 భవనంతోపాటు 770 గ్రాముల బంగారు నగలు, 3 కిలోల వెండి గుర్తించారు. అంతేకాకుండా రూ.1.15 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో మరో రూ.3 లక్షలు ఉన్నట్లు తేల్చారు. వీటితోపాటు ఓ కారు, ద్విచక్ర వాహనం గుర్తించారు. అక్రమాల ఆరోపణలతో 2024 జులై నుంచి 2026 మార్చి వరకు శాంతి సస్పెన్షన్‌లో ఉన్నారు.

## కోడిగుడ్లను ఎలా తింటే శరీరానికి అధిక మొత్తంలో పోషకాలు లభిస్తాయి.. వీటిని ఎలా తినాలి..?



అత్యంత పోషకపరమైన ఆహారాల్లో గుడ్లు కూడా ఒకటి. వీటిని రోజూ వారి ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల శరీరానికి ఎంతో మేలు కలుగుతుంది. వీటిలో అనేక పోషకాలు ఉంటాయి కనుక వీటిని సంపూర్ణ ఆహారంగా చెప్పవచ్చు. గుడ్లు కంప్లీట్ ప్రోటీన్ గా పరిగణించబడతాయి. శరీరం స్వయంగా తయారు చేసుకోలేని తొమ్మిది ముఖ్యమైన అమైనో ఆమ్లాలు గుడ్డులో ఉంటాయి. కండరాల పునరుద్ధరణలో, పెరుగుదలలో, శరీర పనితీరుకు ఇవి ఎంతో సహాయపడతాయి. వీటితో పాటు గుడ్డులో విటమిన్ బి12, విటమిన్ డి, సెలీనియం, కొలిన్ వంటి ముఖ్యమైన పోషకాలు కూడా ఉంటాయి. బరువును నియంత్రించడంలో, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, కంటి ఆరోగ్యాన్ని కాపాడడంలో ఇవి ఎంతో సహాయపడతాయి. గుడ్డును వివిధ రూపాల్లో వండుకుని తీసుకుంటూ ఉంటారు. అయితే గుడ్లను వండే విధానం వాటి పోషక విలువలపై ప్రభావం చూపిస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

### ఉడకబెట్టి లేదా పోచింగ్ చేసి..

గుడ్లను కొందరు పచ్చిగా తీసుకుంటారు. అయితే ఇలా తీసుకోవడానికి బదులుగా గుడ్లను వండి తీసుకోవడం వల్ల వీటిలో ఉండే ప్రోటీన్ సులభంగా జీర్ణమవుతుంది. అలాగే గుడ్డులో ఉండే బయోటిన్ అనే విటమిన్ ను శరీరం సులభంగా ఉపయోగించుకోగలుగుతుంది. గుడ్లను తక్కువ సమయం తక్కువ ఉష్ణోగ్రత మీద ఉడికించి తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి మేలు కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే గుడ్లను ఉడకబెట్టడం లేదా పోచింగ్ చేయడం అత్యంత ఆరోగ్యకరమైన పద్ధతుల్లో ఒకటి. గుడ్లను ఉడకబెట్టడం వల్ల నూనె, వెన్న వంటి వాటి అవసరం ఉండదు. దీంతో తక్కువ క్యాలరీలు, ఎక్కువ పోషకాలను తీసుకోగలుగుతారు. అలాగే తక్కువ ఉష్ణోగ్రతలో వండడం వల్ల వేడి వల్ల నశించే పోషకాలు ఎక్కువగా నశించకుండా ఉంటాయి. కొలెస్ట్రాల్ ఆక్సిడేషన్ కూడా తగ్గుతుంది.

### ఆలివ్ ఆయిల్ మేలు..

ఇక ఉడకబెట్టడంతో పాటు గుడ్లను స్క్రాంబుల్ చేసి కూడా తీసుకోవచ్చు. స్క్రాంబుల్ గుడ్లు కూడా ఆరోగ్యకరమైన ఎంపికల్లో ఒకటి. అయితే దీనిని తయారు చేసేటప్పుడు ఆలివ్ ఆయిల్ లేదా అవకాడో ఆయిల్ వంటి తక్కువ కొవ్వులు ఉన్న నూనెలను ఉపయోగించడం మంచిది. ఇందులో పాలకూర, క్యాప్సికం, టమాటా వంటి కూరగాయలు కలిపి తక్కువ ఉష్ణోగ్రత వద్ద వండి తీసుకోవడం వల్ల మరింత మేలు కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు. అదే విధంగా గుడ్లను ఎక్కువ సమయం ఎక్కువ ఉష్ణోగ్రత వద్ద వండడం మంచిది కాదని ఇలా వండడం వల్ల హానికరమైన సంయోగాలు ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు తెలియజేస్తున్నారు. అలాగే గుడ్డులో ఉండే పోషకాలను ఎక్కువ మొత్తంలో పొందడానికి వారు కొన్ని సూచనలను కూడా చేస్తున్నారు.

### కూరగాయలతో కలిపి అయితే..

ఎల్లప్పుడూ తాజా లేదా ఆర్గానిక్ గుడ్లను మాత్రమే ఎంచుకోవాలి. తాజా గుడ్లల్లో పోషకాలు ఎక్కువగా ఉంటాయి. అలాగే వీటిని పాలకూర, టమాటా, క్యాప్సికం వంటి ఫైబర్ ఎక్కువగా ఉండే కూరగాయలతో కలిపి తీసుకోవడం మంచిది. గుడ్డులోని పోషకాలు ఎక్కువగా పచ్చసొనలోనే ఉంటాయి. కనుక గరిష్ట ప్రయోజనాల కోసం పచ్చసొనను తీసుకోవడం మంచిది. గుడ్డును ఎక్కువ వేడి వద్ద ఎక్కువ సమయం ఉడికించడం వల్ల విటమిన్ డి సుమారు 61 శాతం తగ్గుతుంది. కనుక వీటిని తక్కువ ఉష్ణోగ్రత వద్ద ఉడికించడం మంచిది. గుడ్డు ఆరోగ్యానికి మేలు చేసేదే అయినప్పటికీ వీటిని మితంగా తీసుకోవడం మంచిది. ఆరోగ్యంగా ఉండే వ్యక్తులు రోజుకు ఒక గుడ్డు తినడం సురక్షితం అని నిపుణులు తెలియజేస్తున్నారు. ఈ విధంగా తగిన సూచనలను పాటిస్తూ గుడ్లను తీసుకోవడం వల్ల వాటి వల్ల కలిగే ప్రయోజనాలను అధిక మొత్తంలో పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

## టాయిలెట్‌లో ఎక్కువ సేపు కూర్చుని ఫోన్ చూస్తే అంతే.. పైల్స్ గ్యారంటీ అంటున్న నిపుణులు..

టాయిలెట్‌లో కూర్చుని మొబైల్‌లో స్క్రోల్ చేయడం ఇప్పుడు చాలా మందికి అలవాటుగా మారిందని చెప్పవచ్చు. పెద్దలలో సుమారు 66% మంది టాయిలెట్‌లో కూర్చుని వార్తలు చూడటం లేదా సోషల్ మీడియా బ్రౌజ్ చేయడం చేస్తూ ఉంటారు. ఈ ఆధునిక అలవాటు కారణంగా చాలా మంది టాయిలెట్‌లో ఎక్కువసేపు కూర్చుంటున్నారు. ఇది వారి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇలా ఎక్కువసేపు కూర్చుని మొబైల్ ఉపయోగించడం వల్ల పెద్దప్రేగు దగ్గర ఉన్న రక్తనాళాలు ఉబ్బిపోయి పైల్స్ (హెమరాయిడ్స్) సమస్య వచ్చే అవకాశం ఉందని ఇవి అంతర్గతంగా లేదా బయట వైపు కూడా రావచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు. మన దేశంలో సుమారు 4 కోట్ల మందికి పైగా పైల్స్ సమస్యతో బాధపడుతున్నారు. ప్రతి సంవత్సరం సుమారు 10 లక్షల కేసులు కొత్తగా గుర్తించబడుతున్నాయి.

టాయిలెట్‌లో ఎక్కువ సేపు గడిపితే.. పైల్స్ సమస్యతో బాధపడే వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతుందని, టాయిలెట్ లో ఎక్కువ సమయం కూర్చోవడం కూడా ఇందుకు ఒక కారణమని నిపుణులు చెబుతున్నారు. అసలు టాయిలెట్‌లో కూర్చుని ఎక్కువ సమయం మొబైల్ వాడటం వల్ల పైల్స్ ఎందుకు వస్తాయో ఇప్పుడు తెలుసుకుందాం. ూబఎశ్రీఅష ూఱఎత్థుతీఎ శీట ూఽఱవఅష్వ ూఅవ లో ప్రచురితమైన ఒక కొత్త అధ్యయనం ప్రకారం, టాయిలెట్‌లో మొబైల్ స్క్రోల్ చేయడం వల్ల పైల్స్ వచ్చే ప్రమాదం 46% వరకు పెరుగుతుంది. దీని వల్ల నొప్పి, దురద, రక్తస్రావం కూడా రావచ్చు. హెమరాయిడ్స్ అనేవి పెద్దప్రేగు లేదా మలద్వారం వద్ద ఉన్న రక్తనాళాలు ఉబ్బిపోవడం వల్ల వస్తాయి. టాయిలెట్‌లో ఎక్కువసేపు కూర్చోవడం వల్ల మలద్వారం దగ్గర ఒత్తిడి ఎక్కువగా పడుతుంది. దీని వల్ల అక్కడి రక్తనాళాలు విస్తరించి ఉబ్బిపోతాయి. కనెక్టివ్ టిష్యూ బలహీనపడుతుంది. మొబైల్ వాడటం వల్ల తెలియకుండా ఎక్కువ సమయం టాయిలెట్‌లో కూర్చుంటారు. దీని వల్ల మలద్వారంపై ఒత్తిడి పడి పైల్స్ వచ్చే అవకాశం పెరుగుతుంది.

# రాత్రి సమయంలో ఆకలి అవుతుందా.. ఇలా ఎందుకు జరుగుతుంది.. ఏం చేయాలి..?



రాత్రి సమయంలో ఆకలిగా అనిపించినప్పుడు చాలా మంది తమని తాము నిందించుకుంటారు. అది కేవలం నియంత్రణ లేకపోవడం లేదా అనారోగ్యకరమైన స్నాక్స్ తినే అలవాటు వల్లనే అని భావిస్తారు. అయితే రాత్రి తరచుగా ఆకలి వేయడం అనేది చాలా సందర్భాల్లో శరీరంలోని జీవసంబంధ ప్రక్రియలు, హార్మోన్ల మార్పుల కారణంగా కూడా జరగవచ్చని తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. ఆకలి అవ్వడం అనేది శరీరంలోని అంతర్గత గడియారం, ఆకలి, తృప్తి, మెటాబాలిజాన్ని నియంత్రించే పలు హార్మోన్లపై ఆధారపడి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. నిద్ర సరిగా లేకపోవడం, ఒత్తిడి, మెటాబాలిక్ సమస్యలు లేదా హార్మోన్ మార్పులు వంటి కారణాల వల్ల ఈ వ్యవస్థలు ప్రభావితమైతే సాయంత్రం లేదా రాత్రి సమయంలో ఆకలి ఎక్కువగా అనిపించవచ్చని వారు చెబుతున్నారు.

### హార్మోన్ల ప్రభావం..

రాత్రి ఆలస్యంగా ఆకలి వేయడాన్ని చాలా మంది బలహీన సంకల్పంగా భావిస్తారు. కానీ చాలా సందర్భాల్లో అది శరీర జీవశాస్త్రంతో సంబంధం ఉంటుంది. ఆకలిని సర్కేడియన్ క్లాక్‌తో పాటు గ్రెలిన్, లెప్టిన్, ఇన్సులిన్, కార్టిసాల్ వంటి హార్మోన్లు నియంత్రిస్తాయి అని వైద్యులు చెబుతున్నారు. అలాగే ఏం తింటారనే విషయం ఎంత ముఖ్యమో, ఎప్పుడు తింటారనేది కూడా అంతే ముఖ్యమని, సాయంత్రం ఆలస్యంగా తినడం వల్ల ఆకలి పెరగడం, శరీరం క్యాలరీలను ఖర్చు చేసే సామర్థ్యం తగ్గడం జరుగుతుంది. దీని వల్ల బరువు పెరగడం, మెటాబాలిక్ వ్యాధుల ప్రమాదం కూడా పెరుగుతుందని వైద్యులు తెలియజేస్తున్నారు. అందువల్ల రాత్రి తరచుగా ఆకలి వేయడం అనేది కేవలం అలవాటు మాత్రమే కాకుండా నిద్ర సమస్యలు లేదా హార్మోన్ మార్పులు వంటి ఆరోగ్య సమస్యలకు సంకేతం కావచ్చు అని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### రాత్రిపూట ఆలస్యంగా తింటే..

శరీరంలోని ఆకలి నియంత్రణ వ్యవస్థ చాలా సంక్లిష్టంగా ఉంటుంది. గ్రెలిన్ ఆకలిని పెంచుతుంది. లెప్టిన్ తృప్తి సంకేతాన్ని ఇస్తుంది. జీఎల్‌పీ-1, పెప్టైడ్ yy వంటి జీర్ణాశయ హార్మోన్లు భోజనం తర్వాత తృప్తిని పెంచుతాయి. ఇన్సులిన్ రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రిస్తుంది. కార్టిసాల్ ఒత్తిడి, నిద్ర నమూనాలను ఆహార కోరికలతో కలిపి ప్రభావితం చేస్తుంది. ఈ హార్మోన్లన్నీ రోజువారీ జీవ గడియారం ప్రకారం పనిచేస్తాయని నిద్ర తగ్గిపోవడం లేదా ఆలస్యంగా నిద్రించడం వల్ల ముఖ్యంగా సాయంత్రం సమయంలో ఆకలి సంకేతాలు ఎక్కువగా రావచ్చని వైద్యులు తెలియజేస్తున్నారు. అలాగే ఒకే రకమైన క్యాలరీలు తీసుకున్నప్పటికీ రోజులో ఆలస్యంగా తినేవారిలో ఆకలి ఎక్కువగా ఉండడం, శక్తి వినియోగం తగ్గిపోవడం జరుగుతుందని పరిశోధనలు తెలియజేస్తున్నాయి. హార్వర్డ్ మెడికల్ స్కూల్, బ్రిగ్హామ్ అండ్ ఉమెన్స్ హాస్పిటల్ నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం, ఆలస్యంగా తినే వ్యక్తుల్లో ఆకలి ఎక్కువగా ఉంటుంది. క్యాలరీలు ఖర్చయ్యే వేగం తగ్గుతుంది. కొవ్వు నిల్వకు సంబంధించిన హార్మోన్ మార్పులు కూడా జరుగుతాయి. నిద్ర లేకపోవడం ఈ సమస్యను మరింత పెంచుతుంది. నిద్ర తక్కువగా ఉంటే గ్రెలిన్ పెరిగి, లెప్టిన్ తగ్గిపోతుంది. దీని వల్ల ఎక్కువగా ఆకలి వేస్తుంది. అధిక క్యాలరీల ఆహారం తినాలనే కోరిక పెరుగుతుంది.

### ఎండోక్రైన్ లేదా మెటబాలిక్ వ్యాధులు ఉంటే..

ఇక వైద్యుల చెబుతున్న దాని ప్రకారం కొన్ని ఎండోక్రైన్, మెటాబాలిక్ వ్యాధులు కూడా రాత్రి ఆకలి పెరగడానికి కారణం కావచ్చు. స్థూలకాయం, PCOS, మెనోపాజ్ లేదా పెరిమెనోపాజ్, కుషింగ్స్ సిండ్రోమ్, స్లీప్ అప్నియా వంటి వ్యాధులు కూడా ఆకలి పెరగడానికి కారణం అవుతాయని వైద్యులు చెబుతున్నారు. వీటితో పాటు ఇన్సులిన్ రెసిస్టెన్స్, నిద్ర విఘాతం లేదా కార్టిసాల్ మార్పులు వంటివి కూడా రాత్రి సమయంలో ఆకలిని పెంచుతాయి. అలాగే స్త్రీలల్లో మెనోపాజ్ సమయంలో ఈస్ట్రోజెన్ స్థాయిలు తగ్గడం వల్ల నిద్ర సమస్యలు, మూడ్ మార్పులు, శరీర కొవ్వు పంపిణీ మార్పులు జరుగుతాయి. ఇవి కూడా స్త్రీలలో ఆకలి పెరగడానికి కారణమవుతుంది. అలాగే స్లీప్ అప్నియా వంటి నిద్ర సమస్యలు కూడా ఆకలి నియంత్రణను ప్రభావితం చేస్తాయి. ఇవి కూడా బరువు పెరగడం, మెటాబాలిక్ సమస్యలకు దారితీయవచ్చు.

### జీఎల్‌పీ-1 మందుల ప్రభావం..

అయితే కొత్తగా వచ్చిన జీఎల్‌పీ-1 హార్మోన్‌ను అనుకరించే బరువు తగ్గించే మందులు ఆకలిని తగ్గించడంలో సహాయపడుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఈ మందులు సాధారణంగా ఆకలిని తగ్గిస్తాయి. ఎప్పుడూ తినాలనే ఆలోచనని కూడా తగ్గిస్తాయి. అయితే కొన్ని పరిస్థితుల్లో రాత్రి ఆకలి కొనసాగవచ్చు. మందు మోతాదు ప్రారంభ దశలో ఉండటం, రోజులో తగినంత ప్రోటీన్ తీసుకోకపోవడం, వాంతుల భయం వల్ల భోజనం మానేయడం, నిద్ర సమస్యలు ఉండటం వల్ల ఆకలి అలాగే కొనసాగవచ్చు. జీఎల్‌పీ-1 రిసెప్టర్ అగోనిస్టులు మెదడులో తృప్తి కేంద్రాలను ఉత్తేజపరచి, జీర్ణశాయ-మెదడు సంకేతాలను మెరుగుపరచడం ద్వారా తక్కువ ఆహారం తినేలా చేస్తాయి. 2025 డిసెంబర్‌లో ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) స్థూలకాయ చికిత్సలో జీఎల్‌పీ-1 మందులపై మొదటి మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ మందులను కేవలం అందం కోసం కాకుండా దీర్ఘకాలిక వ్యాధి చికిత్సలో భాగంగా ఉపయోగించాలని సూచించింది.

### వైద్యులను కలవాలి..

కొన్నిసార్లు రాత్రి ఆకలి సాధారణమే అయినప్పటికీ రాత్రి తక్కువ బ్లడ్ షుగర్ లక్షణాలు, చెమటలు ఎక్కువగా పట్టడం, భయంకరమైన కలలు, ఉదయం తలనొప్పి, గందరగోళం, గుండె వేగంగా కొట్టుకోవడం, రాత్రి సమయంలో బ్లడ్ షుగర్ 70 mg/dL కంటే తక్కువగా ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. రాత్రి ఆకలి వేయడాన్ని చాలా మంది కేవలం అలవాటు లేదా నియంత్రణ లేకపోవడంగా భావిస్తారు. కానీ శాస్త్రీయ పరిశోధనలు చెబుతున్నదేమిటంటే హార్మోన్లు, నిద్ర, మెటాబాలిజం, శరీర జీవ గడియారం కలిసి ఈ సమస్యను ప్రభావితం చేస్తాయి. అప్పుడప్పుడు రాత్రి ఆకలి కావడం సహజం. అయితే ఇది తరచుగా జరుగుతూ ఇతర లక్షణాలతోపాటు ఉంటే వైద్య పరీక్షలు చేయించుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

# వేసవి కాలంలో తాగే కాంజీ పానీయం.. ఎలా తయారు చేయాలి.. దీంతో కలిగే లాభాలు ఏమిటి..?



కాంజీ అనేది పులియబెట్టిన సాంప్రదాయ భారతీయ వేసవి పానీయం. ఇది సాధారణంగా నల్ల క్యారెట్, ఆవాలు, నీరు కలిపి తయారు చేస్తారు. ఈ సాంప్రదాయ వేసవి పానీయంలో ప్రోబయోటిక్స్ సమృద్ధిగా ఉంటాయి. కనుక జీర్ణాశయ ఆరోగ్యానికి మేలు చేసేదిగా ఇది ప్రసిద్ధి చెందింది. కాంజీని తీసుకోవడం వల్ల జీర్ణ ఆరోగ్యం మెరుగుపడడంతోపాటు శరీరానికి కూడా అనేక ప్రయోజనాలు అందుతాయి. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో, శరీరాన్ని చల్లబరిచే, హైడ్రేట్ చేసే పానీయాలు తీసుకోవడం చాలా అవసరం. అధిక వేడి కారణంగా జీర్ణవ్యవస్థ మందగిస్తుంది. అందుకే కాంజీ వంటి ఫెర్మెంటెడ్ పానీయాలు ఇప్పుడు ఎక్కువగా ప్రాచుర్యం పొందుతున్నాయి. శాస్త్రీయంగా కూడా ఇవి జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరచడం, రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయని పరిశోధనలు కూడా సూచిస్తున్నాయి. కాంజీలో ఉన్న ప్రోబయోటిక్స్ వేసవిలో సహజంగా మందగించే జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడతాయని అధ్యయనాలు కూడా తెలియజేస్తున్నాయి.

### అధిక సంఖ్యలో ప్రో బయోటిక్స్..

జీర్ణవ్యవస్థ సరిగా పనిచేస్తేనే రోగనిరోధక శక్తి కూడా మెరుగుపడుతుంది. శరీరంలోని 70-80% రోగనిరోధక కణాలు జీర్ణాశయంలోనే ఉంటాయి. అందువల్ల జీర్ణాశయం ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. కాంజీ ఫెర్మెంటేషన్ ప్రక్రియ ద్వారా తయారవుతుంది. కనుక ఈ ప్రక్రియ వల్ల దాని ఆరోగ్య ప్రయోజనాలు మరింత పెరుగుతాయి. కాంజీని సాధారణంగా సూర్యరశ్మిలో ఉంచి ఫెర్మెంట్ చేస్తారు. ఇలా చేయడం వల్ల ఇందులో ప్రోబయోటిక్స్ సంఖ్య పెరుగుతుంది. ఫెర్మెంటేషన్ సమయంలో ఉపయోగకరమైన సూక్ష్మజీవులు పెరుగుతాయి. ఇవి జీర్ణాశయంలోని మంచి బ్యాక్టీరియాను సమతుల్యంగా ఉంచి జీర్ణక్రియను మెరుగుపరచడంతోపాటు రోగనిరోధక శక్తిని కూడా పెంచుతాయి. కాంజీలో ముఖ్యంగా లాక్టోబాసిల్లస్, బిఫిడోబాక్టీరియం, ఎంటరోకోకస్ వంటి బ్యాక్టీరియాలు ఉంటాయి. ఇవి శక్తివంతమైన ప్రోబయోటిక్స్‌గా పనిచేస్తాయి.

### జీర్ణ సమస్యలు తగ్గేందుకు..

అదనంగా ఫెర్మెంటేషన్ ప్రక్రియ వల్ల శరీరంలో పోషకాల శోషణ కూడా పెరుగుతుంది. అందువల్ల కాంజీని భోజనంతోపాటు తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. అంతేకాకుండా ఫెర్మెంటేషన్ వల్ల ఈ పానీయంలో మైక్రోన్యూట్రియెంట్స్ కూడా పెరుగుతాయని పరిశోధనలు తెలియజేస్తున్నాయి. కాంజీ శరీరానికి చల్లదనాన్ని ఇవ్వడంతోపాటు శరీరాన్ని హైడ్రేట్ చేసే ఒక పానీయం. కనుక దీనిని వేసవిలో ఎక్కువగా తీసుకుంటారు. సరైన విధంగా ఫెర్మెంట్ అయిన కాంజీలో ఉండే ప్రోబయోటిక్స్ జీర్ణాశయ లైనింగ్‌ను బలపరచడంలో, జీర్ణాశయంలో వాపులను తగ్గించడంలో, జీర్ణాశయం అసౌకర్యాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. కాంజీ తయారీలో ప్రధానంగా ఉపయోగించే నల్ల క్యారెట్, మసాలాలు శరీరానికి హైడ్రేషన్‌తో పాటు జీర్ణాశయం ఆరోగ్యాన్ని కూడా అందిస్తాయి. అందువల్ల ఇది సహజ ఇమ్యూనిటీ బూస్టర్‌గా కూడా పనిచేస్తుంది.

### ఇన్‌ఫెక్షన్లకు చెక్..

కాంజీ ఒక ఆరోగ్యకరమైన పానీయం. అయితే దాన్ని సరైన విధంగా నిల్వ చేసి సరైన సమయంలో తీసుకుంటేనే పూర్తి ప్రయోజనం పొందవచ్చు. దీన్ని చల్లగా లేదా గది ఉష్ణోగ్రతలో తాగవచ్చు. కానీ ఎక్కువ వేడి తగిలితే పాడయ్యే అవకాశం ఉంది. ఇక కాంజీ తాగడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. వేసవిలో జీర్ణక్రియ మందగించి కడుపు ఉబ్బరం సమస్యలు రావచ్చు. కాంజీ వాటిని తగ్గించడంలో సహాయపడుతుంది. జీర్ణాశయం ఆరోగ్యంగా ఉంటే రోగనిరోధక కణాలు కూడా బలంగా పనిచేస్తాయి. అందువల్ల సీజనల్ ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుంది. బయటి ఉష్ణోగ్రతలు పెరిగినప్పుడు శరీరాన్ని చల్లబరచి హీట్ ను తగ్గిస్తుంది. ఇలా కాంజీ ఎంతో సహాయపడుతుందని, వేసవి కాలంలో దీనిని తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని నిపుణులు తెలియజేస్తున్నారు.

### కాంజీ తయారీ ఇలా..


అలాగే ఇంట్లో కూడా సులభంగా కాంజీని తయారు చేసుకోవచ్చు. కాంజీని తయారు చేయడం చాలా సులభం. ముందుగా నల్ల క్యారెట్, ఆవాలు, నీరు సరైన నిష్పత్తిలో కలపాలి. ఈ మిశ్రమాన్ని శుభ్రమైన గాజు సీసాలో నిల్వ చేయాలి. సీసాను గట్టిగా మూసి సూర్యరశ్మిలో ఉంచాలి. కనీసం ఒక వారం పాటు ఫెర్మెంట్ అయ్యేలా ఉంచాలి. ఒక్కొక్కరి రుచి ఒక్కోలా ఉంటుంది కనుక మసాలాల నిష్పత్తిని వారి రుచికి అనుగుణంగా మార్చుకోవాలి. అయితే కాంజీ ఆరోగ్యానికి మేలు చేసేదే అయినప్పటికీ జీర్ణాశయ ఆరోగ్య సమస్యలు ఉన్న వారు వైద్యుల సలహా లేకుండా కాంజీని తాగకపోవడం మంచిది. ఆరోగ్యవంతులైనా ఎక్కువగా తాగితే జీర్ణక్రియ ఎక్కువగా జరిగి అసౌకర్యం కలగవచ్చు. కాబట్టి కాంజీని తీసుకోవడంలో మోతాదు, సమయం కూడా ముఖ్యమైనవి.


# ప్రభాస్‌తో ఆదిత్య ధర్ మూవీ



'ధురంధర్ 2' ఘన విజయం తర్వాత దర్శకుడు ఆదిత్య ధర్ పేరు ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధించి, రికార్డుల సునామీ సృష్టించడంతో ఆయన తదుపరి ప్రాజెక్ట్‌పై ఆసక్తి మరింత పెరిగింది. తాజా సమాచారం ప్రకారం, ఆదిత్య ధర్ ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుడుతున్నారని తెలుస్తోంది. టాలీవుడ్, కోలీవుడ్ ఇండస్ట్రీలను కలిపి పాన్ ఇండియా స్థాయిలో ఇండియన్ సినిమాను షేక్ చేసేలా ఓ మల్టీస్టారర్‌ను తెరకెక్కించాలనే ఆలోచనలో ఉన్నారట. ఆ చిత్రంలో ప్రభాస్,సూర్య కలిసి నటించబోతున్నారని బాలీవుడ్ సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ ప్రాజెక్ట్ హై వోల్టేజ్ మాస్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఉండబోతోందని టాక్. ఇద్దరు స్టార్ హీరోలు కావడంతో వారి పాత్రలకు సమాన ప్రాధాన్యం ఉండేలా పవర్‌ఫుల్ క్యారెక్టర్స్‌ను రూపొందిస్తున్నారని సమాచారం. కథ కూడా పాన్ ఇండియా రేంజ్‌లో ఉండి, దేశ విదేశాల్లోని పలు ఇంటర్నేషనల్ లొకేషన్స్‌లో షూటింగ్ ఎ÷-లాన్ చేస్తున్నారట. ప్రభాస్‌కు ఉన్న పాన్ ఇండియా మార్కెట్, సూర్యకు ఉన్న నటనా ప్రతిభ ఈ రెండు కలిస్తే బాక్సాఫీస్ వద్ద భారీ సంచలనం ఖాయం అని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా యాక్షన్ సీక్వెన్స్‌లు, ఎమోషనల్ డ్రామా మధ్య మంచి బ్యాలెన్స్ ఉండేలా స్క్రిప్ట్ సిద్ధం చేస్తున్నారట. అయితే ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ ఈ వార్తలు సోషల్ మీడియా, సినీ వర్గాల్లో వైరల్ అవుతూ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ప్రభాస్, సూర్య కాంబినేషన్ నిజమైతే ఇది ఇండియన్ సినిమా చరిత్రలోనే ఒక క్రేజీ ప్రాజెక్ట్‌గా నిలుస్తుందని ఫ్యాన్స్ ఇప్పటికే అంచనాలు పెంచుకుంటున్నారు. ఇక అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందో చూడాలి.

# పెద్ది విడుదల జూన్‌కు మారినట్లేనా?




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం పెద్ది విడుదల తేదీపై గందరగోళం నెలకొంది. మొదట ఈ సినిమాను ఏప్రిల్ 30న విడుదల చేస్తామని ప్రకటించినప్పటికీ, తాజా పరిణామాలు చూస్తుంటే ఆ తేదీకి రావడం కష్టమేనని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల 'చెన్నై లవ్ స్టోరీ' ఈవెంట్‌లో నిర్మాత ఎస్‌కేఎన్ సినిమా వాయిదా పడే అవకాశాలపై వ్యాఖ్యలు చేయడంతో మెగా అభిమానులు తీవ్రంగా స్పందించారు. ఈ వ్యాఖ్యలపై వివాదం రేగడంతో ఆయన తర్వాత వివరణ ఇచ్చారు. మరోవైపు, 'రాకాస' టీంతో మాట్లాడిన సమయంలో 'సినిమా లేట్ అవ్వదు' అని రామ్ చరణ్ స్వయంగా చెప్పడంతో ఫ్యాన్స్ కాస్త కూల్ అయ్యారు. అయినప్పటికీ, ప్రస్తుత పరిస్థితులు చూస్తే వాయిదా అనివార్యంగా కనిపిస్తోంది. తాజా సమాచారం ప్రకారం, 'పెద్ది' సినిమా జూన్ నెలలో విడుదలయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం చిత్ర యూనిట్ రెండు తేదీలను పరిశీలిస్తోంది. జూన్ 4 లేదా జూన్ 24. ఈ తేదీల్లో ఏదో ఒకదానిని ఫైనల్ చేయాలని భావిస్తున్నారు. త్వరలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశముంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ వేగంగా కొనసాగుతోంది. కీలక సన్నివేశాల్లో రామ్ చరణ్ పాల్గొంటూ బిజీగా ఉన్నారు. సినిమాను అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు టీమ్ కష్టపడుతోంది. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ముఖ్య పాత్రల్లో శివరాజ్ కుమార్, జగపతిబాబు , అలాగే 'మిర్జాపూర్' ఫేమ్ దివ్యేందు శర్మ కనిపించనున్నారు. సంగీతాన్ని ఏఆర్ రెహమాన్ అందిస్తుండగా, ఇప్పటికే విడుదలైన పాటలు మంచి స్పందన పొందాయి. మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ సినిమా మీద అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. రిలీజ్ డేట్‌పై క్లారిటీ రాగానే ప్రమోషన్స్‌ను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లేలా యూనిట్ ప్లాన్ చేస్తోంది.

# జట్టులో చేరనున్న మిచెల్ స్టార్క్

ఈ ఐపీఎల్ సీజన్ లో ఇప్పటివరకు బోణీ కొట్టని జట్లు అంటూ ఏవైనా ఉన్నాయంటే అవి చెన్నై సూపర్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్. ఈ రెండు జట్లు కూడా ఆడిన మ్యాచ్ లన్నీ ఓడిపోయాయి. చెన్నై మూడు, గుజరాత్ రెండింట్లో పరాజయం పాలయ్యాయి. తమ ప్రత్యర్థులకు రెండేసి చొప్పున పాయింట్లను ధారదాత్తం చేశాయి. ఈ వరుస ఓటములు చెన్నై సూపర్ కింగ్స్ ను మాత్రం తీవ్రంగా ఇబ్బంది పెట్టాయి. హేటర్స్ కు ట్రోలింగ్ స్టఫ్ ను అందించాయి. ఈ పరిస్థితుల మధ్య ఈ రెండు జట్లనూ ఎదుర్కొనబోతోంది ఢిల్లీ కేపిటల్స్. దెబ్బతిన్న పులుల్లా ఉన్న గుజరాత్, చెన్నైతో ఈ నెల 8, 11 తేదీల్లో మ్యాచ్ లను ఆడాల్సి ఉంది. 18న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును ఢీకొట్టబోతోంది. ఇప్పుడీ మూడు మ్యాచ్ లకు కూడా స్టార్ పేస్ బౌలర్ మిఛెల్ స్టార్క్ దూరం అయ్యాడు. ఇప్పటివరకు ఆడిన రెండింట్లోనూ నెగ్గి దూకుడు మీదున్న ఢిల్లీ కేపిటల్స్.. తన జైత్రయాత్రను కొనసాగించాలంటే స్టార్క్ అవసరం ఎంతైనా ఉంది. ఈ స్టార్ ఆటగాడు మరో మూడు మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడని తెలుస్తోంది. భుజం, మోచేతి గాయాల నుంచి ఆస్ట్రేలియాలో ట్రీట్మెంట్ తీసుకున్నాడు. అక్కడే కోలుకుంటోన్నాడు. ఇప్పటివరకు జట్టుతో కలవలేదు కూడా. అత్యంత కీలకమైన ఈ మూడు మ్యాచ్ లకూ ఈ స్టార్ బౌలర్ సేవలను జట్టు కోల్పోనుంది. మిచెల్ స్టార్క్ ఈ సీజన్‌లో ఏదో ఒక సమయంలో జట్టుతో చేరతాడని ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యం ఆశాభావంతో ఉంది. ఈ ఎడమచేతి వాటం బౌలర్ లేనప్పటికీ అక్షర్ పటేల్ సారథ్యంలోని ఢిల్లీ జట్టు లక్నో సూపర్ జెయింట్స్, ముంబై ఇండియన్స్‌పై విజయం సాధించింది. బౌలింగ్ యూనిట్ అద్భుత ప్రదర్శన చేసింది. ముఖేష్ కుమార్, లుంగి ఎన్‌గిడి, టీ నటరాజన్ కీలక ఓవర్లలో కచ్చితత్వంతో బౌలింగ్ చేశారు. అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, విప్రజ్ నిగమ్ వంటి స్పిన్నర్లు మిడిల్ ఓవర్లల్లో సత్తా చాటుతున్నారు. చెన్నై, గుజరాత్, బెంగళూరుతో ఆడాలంటే మాత్రం అదనపు బౌలింగ్ వనరులు తప్పనిసరి. ఈ పరిస్థితుల్లో స్టార్క్ జట్టులో చేరితే బాగుంటుందని ఆశించింది గానీ, అది సాధ్యపడేలా లేదు. గాయంతో ఉన్నప్పటికీ స్టార్క్ జట్టు యాజమాన్యంతో నిరంతరం సంప్రదింపుల్లో ఉన్నాడు. ప్రస్తుతం భుజం, మోచేతికి అయిన గాయం నుంచి కోలుకుంటున్నానని, వీలైనంత త్వరగా ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో చేరడానికి కట్టుబడి ఉన్నానని స్టార్క్ స్పష్టం చేశాడు. ఈ సీజన్ ప్రారంభంలో అందుబాటులో లేనందుకు అభిమానులకు క్షమాపణ సైతం చెప్పాడు.

## అట్లీ, అల్లు అర్జున్ మూవీ పోస్టర్ విడుదల




అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. 'ఎఎ22ఎక్స్ 6'గా ఇది ప్రచారంలో ఉంది. తాజాగా దీనికి సంబంధించిన అప్‌డేట్‌ను చిత్రబృందం పంచుకుంది. అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం దీని టైటిల్‌ను ప్రకటించనున్నట్లు వెల్లడించింది. ఈ విషయాన్ని తెలుపుతూ టీమ్ పంచుకున్న పోస్టర్ అందరిలో ఆసక్తి కలిగించింది. సాధారణంగా టైటిల్ ప్రకటన అంటే హీరో లుక్‌కు సంబంధించిన పోస్టర్‌ను పంచుకుంటారు. కానీ టీమ్ మాత్రం జంతువు పంజా ఉన్న పోస్టర్‌ను షేర్ చేసింది. దీంతో ఈ సినిమా థీమ్‌పై సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. అట్లీ ఏం ప్లాన్ చేస్తున్నారంటూ కామెంట్స్ చేస్తున్నారు. పునర్జన్మల కాన్సెప్ట్‌తో ముడిపడి ఉండే సైన్స్‌ఫిక్షన్ మూవీగా ఇది ముస్తాబవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇందులో అల్లు అర్జున్ పాత్ర మూడు కోణాల్లో సాగుతుందని సమాచారం. మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ వినియోగంతో పాటు... విజువల్ ఎఫెక్ట్స్‌కి పెద్దపీట వేస్తూ ఈ సినిమాని భారీస్థాయిలో తెరకెక్కిస్తున్నారు. ఇందులో ముగ్గురు కథానాయికలు ఉన్నట్లు తెలుస్తోంది. వారిలో దీపికా పదుకొణె పేరు ఇప్పటికే ఖరారైంది.


## అవును పెళ్లయ్యింది....నలుగురు పిల్లలు

### విమర్శకులకు నటి త్రిష ఘాటు రిప్లై



కొన్ని రోజులుగా నటి త్రిష పేరు సోషల్ మీడియాలో వైరలవుతోన్న విషయం తెలిసిందే. నటుడు, టీవీకే అధినేత విజయ్‌తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. తాజాగా త్రిష సినిమాలు మానేస్తున్నారని నటుడు చిత్రా లక్ష్మణన్ ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో చెప్పడం తీవ్ర చర్చకు దారితీసింది. దీనిపై ఆమె తనదైన స్టైల్‌లో కౌంటర్ ఇచ్చారు. ఇన్‌స్టా స్టోరీలో ఈ వ్యాఖ్యలపై పరోక్షంగా స్పందించారు. అవును సినిమాలు మానేశాను. ఒక పెద్ద వ్యాపారవేత్తను పెళ్లి చేసుకొని నలుగురు పిల్లల్ని కన్నాను. మీ ఊహాగానాలకు ఇది సరిపోతుందా?. ఈరోజు మీరు వార్తలు రాసుకోవడానికి ఇది చాలా.. మరేదైనా జోడించమంటారా' అంటూ వ్యంగ్యంగా రాసుకొచ్చారు.. దీంతో ఆమె సినిమాలు మానేయనున్నారంటూ వస్తోన్న వార్తలకు చెక్ పడినట్లైంది. అసలేం జరిగిందంటే.. యూట్యూబ్ వేదికగా ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు చిత్రా లక్ష్మణన్ బదులిచ్చారు. ఇకపై సినిమాల్లో కొనసాగాలని త్రిష అనుకోవడం లేదని.. అవకాశాలనూ అందిపుచ్చుకోవడం లేదన్నారు. దీంతో ఎన్నో ఊహాగానాలు మొదలయ్యాయి. ఆమె పాలిటిక్స్‌పై ఫోకస్ పెట్టనున్నారని వార్తలు వచ్చాయి. తాజా పోస్ట్‌తో వీటికి తనదైన స్టైల్‌లో త్రిష బదులిచ్చారు. ప్రస్తుతం ఆమె సూర్య 'కరుప్పు'(తెలుగులో 'వీరభద్రుడు'), 'విశ్వంభర'లో నటిస్తున్నారు.

## అనన్య పాండే మూవీ చాంద్ మేరా దిల్




బాలీవుడ్ యువ నటి అనన్యా పాండే, 'కిల్' సినిమాతో మెప్పించిన లక్ష్య జంటగా నటిస్తున్న కొత్త సినిమా 'చాంద్ మేరా దిల్'. ఈ సినిమా మే 22న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా తాజాగా టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. హైదరాబాద్ నేపథ్యంలో రాబోతున్న ఈ టీజర్ చూస్తుంటే.. ఇదొక స్వచ్ఛమైన క్యాంపస్ లవ్ స్టోరీ అని అర్థమవుతోంది. ముఖ్యంగా ఇంజనీరింగ్ కాలేజీలో ఆరవ్, చాందిని అనే ఇద్దరు విద్యార్థుల మధ్య మొదలైన ప్రేమ, ఆ తర్వాత వారి జీవితాల్లో ఎదురైన మలుపులు, బాధాకరమైన సంఘటనలను ఈ సినిమాలో చాలా ఎమోషనల్‌గా చూపించబోతున్నారు. మరో విశేషమేమిటంటే, ఈ సినిమా షూటింగ్ ఎక్కువ భాగం హైదరాబాద్‌లోనే జరిగింది, ఇది తెలుగు ప్రేక్షకులకు సినిమాపై మరింత ఆసక్తిని కలిగిస్తోంది. సచిన్-జిగర్ అందించిన మ్యూజిక్ సినిమాకు పెద్ద ప్లస్ కానుంది. నిజానికి ఈ సినిమా ఏప్రిల్‌లోనే రిలీజ్ కావాల్సి ఉంది, కానీ కొన్ని కారణాల వల్ల వాయిదా వేసి, ఇప్పుడు మే 22న థియేటర్లలోకి తీసుకురాబోతున్నారు.

# రాయల్స్ హ్యాట్రిక్.. ముంబైపై ఘన విజయం




### జైస్వాల్ అజేయ అర్ధసెంచరీ

గువాహటి : ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ వరుస విజయాల జోరు కొనసాగుతున్నది. మంగళవారం జరిగిన పోరులో రాజస్థాన్ 27 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్‌పై ఘన విజయం సాధించింది. తద్వారా ఆడిన మూడు మ్యాచ్‌ల్లో హ్యాట్రిక్ విజయాలతో రాయల్స్ అగ్రస్థానంలోకి దూసుకెళ్లింది. రాజస్థాన్ నిర్దేశించిన 151 పరుగుల లక్ష్యఛేదనలో ముంబై 123/9 స్కోరుకు పరిమితమైంది. బర్గర్, బిష్ణోయ్, సందీప్ రెండేసి వికెట్లు తీశారు. టాపార్డర్ త్రయం రోహిత్‌శర్మ(5), రికల్టన్(8), సూర్యకుమార్(6)తో సహా కెప్టెన్ హార్దిక్‌పాండ్యా(9), తిలక్‌వర్మ(14) ఘోరంగా విఫలమయ్యారు. వర్షం అంతరాయం కారణంగా సుమారు రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమైన మ్యాచ్‌ను 11 ఓవర్లకు కుదించారు. కాగా ప్రత్యర్థి ఆహ్వానం మేరకు మొదట బ్యాటింగ్ చేసిన రాజస్థాన్.. 11 ఓవర్లకు 3 వికెట్లు కోల్పోయి 150 పరుగులు చేసింది. ఓపెనర్లు యశస్వీ జైస్వాల్ (32 బంతుల్లో 77నా, 10 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు అర్ధ శతకానికి తోడు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (14 బంతుల్లో 39, 1 ఫోర్, 5 సిక్స్‌లు) వీరవిహారంతో ఆ జట్టు భారీ స్కోరు సాధించింది.

### దొరికిన బంతిని దొరికనట్టు..

4, 6, 4, 4, 4.. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన రాయల్స్‌కు తొలి ఓవర్లోనే జైస్వాల్ అందించిన ఆరంభమది. 3.2 ఓవర్లకు కుదించిన పవర్ ప్లేలో జైస్వాల్, వైభవ్ కండల్లో కరెంటు నింపుకుని వచ్చినట్టుగా దొరికిన బంతిని దొరికినట్టుగా బౌండరీ లైన్ దాటించడంతో రాయల్స్ రన్‌రేట్ 20కి తగ్గకుండా సాగింది. ఈ మ్యాచ్‌కు ముందు వైభవ్.. బుమ్రాను ఎలా ఎదుర్కుంటాడనేదానిపై అందరూ ఆసక్తిగా ఎదురుచూడగా అందరి అంచనాలను తలకిందులు చేస్తూ ఈ బీహార్ కుర్రాడు స్టార్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. బుమ్రా, బౌల్ట్‌ను క్లబ్ స్థాయి బౌలర్లుగా మార్చేసి ధనాధన్ సిక్స్‌లతో విరుచుకుపడ్డాడు. బుమ్రా బౌలింగ్‌లో తాను ఎదుర్కున్న తొలి నాలుగు బంతుల్లో రెండు భారీ సిక్స్‌లు బాదిన అతడు ఆ తర్వాత బౌల్ట్ ఓవర్లోనూ స్కేర్ లెగ్ మీదుగా కళ్లు చెదిరే సిక్స్ కొట్టాడు. శార్దూల్ ఐదో ఓవర్లోనూ 6, 4, 6 దంచిన వైభవ్.. ఆఖరి బంతికి ఎక్స్‌ట్రా కవర్స్ మీదుగా భారీ షాట్ ఆడినా అక్కడే ఫీల్డింగ్ చేస్తున్న తిలక్ వర్మకు చిక్కడంతో ముంబై ఊపిరి పీల్చుకుంది. తొలి వికెట్‌కు ఈ జోడీ 4.6 ఓవర్లలోనే 80 రన్స్ జతచేయడం విశేషం. ఆ తర్వాత జురెల్ (2)ను గజన్‌ఫర్ పెవిలియన్‌కు పంపగా హార్దిక్ 8వ ఓవర్లో బౌండరీతో యశస్వీ వరుసగా రెండో ఫిఫ్టీని పూర్తిచేశాడు. రెండు సిక్స్‌లు, ఒక బౌండరీతో ఊపు మీద కనిపించిన కెప్టెన్ పరాగ్ (20)నూ గజన్‌ఫర్ బోల్తా కొట్టించాడు. శార్దూల్ విసిరిన ఆఖరి ఓవర్లో 18 రన్స్ రాబట్టిన జైస్వాల్.. ఇన్నింగ్స్‌కు అదిరిపోయే ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు.

### ముంబై పోరాడినా..

11 ఓవర్లలో 151 పరుగుల ఛేదనతో బరిలోకి దిగిన ముంబైకి ఆదిలోనే కోలుకోలేని ఎదురుదెబ్బ తగిలింది. ఆర్చర్ ఇన్నింగ్స్ మొదటి ఓవర్ ఆఖరి బంతికి రికల్టన్‌ను ఔట్ చేసి అదిరిపోయే ఆరంభాన్నిచ్చాడు. భారీ సిక్స్‌తో దూకుడు మీద కనిపించిన రికల్టన్..మరో షాట్ ఆడే ప్రయత్నంలో కీపర్ చేతికి చిక్కాడు. వచ్చి రావడంతోనే తనదైన శైలిలో సిక్స్ కొట్టిన సూర్యకుమార్ ఎక్కువసేపు క్రీజులో నిలువలేకపోయాడు. బర్గర్ బౌలింగ్‌లో బౌండరీ దగ్గర ఆర్చర్ క్యాచ్‌తో రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. రెండు పరుగుల తేడాతో రోహిత్‌శర్మ..సందీప్‌శర్మ బౌలింగ్‌లో వికెట్ల ముందు అడ్డంగా దొరికిపోయాడు, బౌలింగ్ మార్పుగా వచ్చిన స్పిన్నర్ రవి బిష్ణోయ్ మూడు బంతుల వ్యవధిలో హార్దిక్‌తో పాటు తిలక్‌ను పెవిలియన్‌కు పంపాడు. దీంతో ముంబై 46 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. ఆఖర్లో రూథర్‌ఫర్డ్(25), నమన్ ధీర్(25) దూకుడుగా ఆడినా..ముంబై గెలుపు వాకిట నిలువలేకపోయింది.

# డేవిడ్ వార్నర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు



ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ మాజీ కెప్టెన్ డేవిడ్ వార్నర్ పీకల దాకా మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. సిడ్నీలోని మౌబ్రా ప్రాంతంలో ఆదివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఉన్న వార్నర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు వెంటనే స్థానిక స్టేషన్‌కు తరలించారు. ఆస్ట్రేలియాలో అనుమతించిన దానికంటే దాదాపు రెట్టింపు స్థాయిలో మద్యం సేవించి అతడు డ్రైవింగ్ చేసినట్లు బ్రీత్ అనలైజర్ పరీక్షలో తేలింది. తప్పతాగి కారు నడుపుతూ ఆస్ట్రేలియా ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను అతడిపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం పాకిస్థాన్ సూపర్ లీగ్ ఆడేందుకు వెళ్లిన వార్నర్, మే నెలలో జరిగే కోర్టు విచారణకు హాజరుకావాల్సి ఉంది. తెలుగు రాష్ట్రాల్లో డేవిడ్ భాయ్ గా విశేష ప్రజాదరణ పొందిన వార్నర్ ఇలా తాగి పట్టుబడటం అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. సోషల్ మీడియాలో టాలీవుడ్ పాటలకు డ్యాన్సులు చేస్తూ ఎప్పుడూ వార్తల్లో నిలిచే ఈ స్టార్ ఆటగాడు, ఇప్పుడు ఏకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో అరెస్టై పోలీసు స్టేషన్ మెట్లు ఎక్కడం క్రీడా వర్గాల్లో సంచలనంగా మారింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏప్రిల్ 5వ తేదీ ఆదివారం సాయంత్రం 5:30 గంటల సమయంలో మలబార్ రోడ్డులో ట్రాఫిక్ పోలీసులు వాహనాలను ఆపి ఆకస్మికంగా తనిఖీలు చేస్తున్నారు. అదే సమయంలో అటుగా వచ్చిన ఒక వ్యాన్ తనిఖీ కేంద్రానికి కొద్దిగా దూరంలోనే ఆగిపోయింది. దీనిని గమనించిన పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని వాహనంలో ఉన్న 39 ఏళ్ల వార్నర్‌కు బ్రీత్ అనలైజర్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో అతను పరిమితికి మించి మద్యం తాగినట్లు పాజిటివ్ ఫలితం వచ్చింది. వెంటనే అతన్ని అదుపులోకి తీసుకున్న అధికారులు మౌబ్రా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడ నిర్వహించిన మరో పరీక్షలో అతని రక్తంలో 0.1 శాతం ఆల్కహాల్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. చట్ట ప్రకారం ఇది నేరం కావడంతో అతనిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కింద కేసు నమోదు చేశారు. ఆ తర్వాత విచారణ నిమిత్తం నోటీసులు ఇచ్చి పంపించారు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఎన్నో రికార్డులు సృష్టించిన వార్నర్ 2024 జనవరిలో రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఆస్ట్రేలియా సొంత గడ్డపై పాకిస్థాన్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌తో పాటు వెస్టిండీస్‌తో జరిగిన వన్డే సిరీస్ తర్వాత జాతీయ జట్టుకు వీడ్కోలు పలికాడు. అప్పటినుంచి కేవలం ప్రపంచవ్యాప్తంగా జరిగే ప్రైవేట్ టీ20 లీగుల్లో మాత్రమే ఆడుతున్నాడు. ఐపీఎల్, పీఎస్ఎల్ లాంటి టోర్నీల్లో చురుకుగా పాల్గొంటూనే మరోవైపు క్రికెట్ వ్యాఖ్యాతగా మీడియా రంగంలో కొత్త ప్రయాణాన్ని ప్రారంభించాడు. మైదానంలో ఎంతో చురుకుగా ఉండే ఈ స్టార్ ఓపెనర్ తాజా వివాదంలో చిక్కుకోవడం అతని కెరీర్‌పై మచ్చ తెచ్చింది. పుష్ప సినిమా డైలాగులు చెబుతూ అల్లు అర్జున్ అభిమానిగా మారిన వార్నర్, తన విభిన్నమైన వ్యవహారశైలితో నిత్యం వార్తల్లో నిలుస్తాడు. అయితే తాజా అరెస్ట్ తో అతని అభిమానులు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు. మే నెలలో రాబోయే కోర్టు తీర్పును బట్టి వార్నర్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

# వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ మ్హాత్రేలకు బీసీసీఐ షాక్

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ప్రతిష్టాత్మకంగా భావించే అండర్-25 జట్టు ఎంపికలో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. రాబోయే కాలంలో భారత టెస్ట్ జట్టుకు వెన్నెముకగా నిలిచే ఆటగాళ్లను గుర్తించేందుకు బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్రత్యేక టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఇందుకోసం ఎంపిక చేసిన 25 మంది సభ్యుల జాబితాలో వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ మ్హాత్రే పేర్లు లేకపోవడం గమనార్హం. శ్రీలంకలో జరగనున్న రెడ్ బాల్ క్రికెట్ సిరీస్ కోసం భారత అండర్-19, అండర్-25 జట్లు పయనమవనున్న తరుణంలో ఈ నిర్ణయం వెలువడింది. ప్రస్తుత ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్ ముగిసిన వెంటనే, బీసీసీఐ ఈ ప్రత్యేక నాలుగు రోజుల మ్యాచ్‌ల టోర్నమెంట్‌ను ప్రారంభించనుంది. దేశవ్యాప్తంగా ఉన్న 64 మంది అత్యుత్తమ యువ క్రికెటర్లను నాలుగు జట్లుగా విభజించి ఈ పోటీలు నిర్వహిస్తారు. ఈ ప్రతిభావంతులను ఎంపిక చేయడానికి ఒక ప్రత్యేక ప్రాతిపదికను అనుసరించారు. అందులో 25 మంది ఆటగాళ్లు సి.కె. నాయుడు ట్రోఫీ, అండర్-23 వన్డే మ్యాచ్‌ల నుంచి, మరో 25 మంది ఆటగాళ్లను రంజీ ట్రోఫీ, విజయ్ హజారే, సయ్యద్ ముస్తాక్ అలీ వంటి ప్రధాన టోర్నీల నుంచి ఎంపిక చేశారు. మిగిలిన 14 స్థానాలను ఐపీఎల్ ప్రదర్శన ఆధారంగా భర్తీ చేయనున్నారు. వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ మ్హాత్రే వంటి మేటి ఆటగాళ్లను ప్రాథమిక జాబితాలో చేర్చకపోవడానికి ఒక బలమైన కారణం ఉంది. వీరిద్దరూ ప్రస్తుతం ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో బిజీగా ఉన్నారు. ఆయుష్ మ్హాత్రే చెన్నై సూపర్ కింగ్స్ తరఫున, వైభవ్ సూర్యవంశీ రాజస్థాన్ రాయల్స్ జట్టులో సభ్యులుగా ఉన్నారు. ఐపీఎల్ ముగిసిన తర్వాత ఎంపిక చేసే టాప్ 14 మంది ఆటగాళ్ల జాబితాలో వీరి పేర్లు ఉండే అవకాశం మెండుగా ఉందని సమాచారం. కాబట్టి అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం ఎంపికైన జట్టులో ఆయుష్ దోసేజా, యశ్ ధుల్, మయాంక్ వర్మ, ఆయుష్ పాండే, శాశ్వత్ రావత్, మహేష్ పిథియా, రాజ్ లింభాని, ఆర్య దేశాయ్, సిద్ధార్థ్ దేశాయ్, ఆకిబ్ ఖాన్, కార్తీక్ యాదవ్, విద్యాధర్ పాటిల్, కె. హిమతేజ, భువనగిరి పున్నయ్య, పుఖరాజ్ మాన్, యశవర్ధన్ దలాల్, పార్థ్ వత్స్, ఈడెన్ ఆపిల్ టామ్, హిమాన్షు సింగ్, అమన్ మోఖడే వంటి ఆటగాళ్లు ఉన్నారు.

## సీఎస్‌కేలో పెను మార్పులు తప్పవా?




ఐపీఎల్ 2026 సీజన్‌లో పాత వైభవానికి దూరమైన చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ప్రస్తుతం అత్యంత క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఇటీవల రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ( తో జరిగిన మ్యాచ్‌లో ఎదురైన ఘోర పరాజయం జట్టు ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసింది. ఈ నేపథ్యంలో, తదుపరి మ్యాచ్‌లో జట్టును తిరిగి విజయాల బాట పట్టించేందుకు యాజమాన్యం, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ భారీ మార్పులకు శ్రీకారం చుట్టనున్నారు. ప్రధానంగా దిగ్గజ ఆటగాడు ఎంఎస్ ధోనీ కీలక బాధ్యతల్లో కనిపించనుండగా, 'బేబీ ఏబీ'గా పిలవబడే డెవాల్డ్ బ్రెవిస్ తుది జట్టులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆర్సీబీతో జరిగిన పోరులో సీఎస్‌కే బ్యాటింగ్ మరియు బౌలింగ్ విభాగాల్లో పూర్తిగా విఫలమైంది. ప్రత్యర్థి జట్టు భారీ స్కోరు సాధిస్తున్నా బౌలర్లు కట్టడి చేయలేకపోయారు. ముఖ్యంగా డెత్ ఓవర్లలో సీఎస్‌కే బౌలింగ్ దారుణంగా ఉంది. బ్యాటింగ్‌లో కూడా టాపార్డర్ విఫలమవ్వడం జట్టును పతనం అంచుకు తీసుకెళ్లింది. ఈ పరాజయంపై సోషల్ మీడియాలో అభిమానులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని మ్యాచ్‌లుగా ధోనీ కేవలం బ్యాటింగ్‌కు మాత్రమే పరిమితమవుతున్నారు. అయితే, జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు ధోనీ అనుభవం అవసరమని యాజమాన్యం భావిస్తోంది. మైదానంలో వ్యూహరచనలో కెప్టెన్ రుతురాజ్‌కు ధోనీ మరింత చురుగ్గా సహకరించనున్నారు. ముఖ్యంగా ఫీల్డ్ సెట్టింగ్, బౌలింగ్ మార్పుల విషయంలో ధోనీ మార్క్ నిర్ణయాలు తదుపరి మ్యాచ్‌లో కనిపిస్తాయని సమాచారం. ధోనీ ఫిట్‌నెస్‌పై కొన్ని అనుమానాలు ఉన్నప్పటికీ, జట్టును గట్టెక్కించేందుకు ఆయన సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. దక్షిణాఫ్రికా యువ సంచలనం డెవాల్డ్ బ్రెవిస్ ప్రస్తుతం సీఎస్‌కే బెంచ్‌కే పరిమితమయ్యాడు. కానీ, మిడిలార్డర్ విఫలమవుతుండటంతో అటాకింగ్ బ్యాటర్ అవసరమని జట్టు భావిస్తోంది. బ్రెవిస్ తనదైన శైలిలో సిక్సర్ల వర్షం కురిపించగలడు. ముఖ్యంగా స్పిన్నర్లను ఎదుర్కోవడంలో అతని సామర్థ్యం జట్టుకు అదనపు బలంగా మారుతుంది. విదేశీ ఆటగాళ్ల కోటాలో ఒకరిని తప్పించి బ్రెవిస్‌ను తుది జట్టులోకి తీసుకునే యోచనలో కోచ్ ఫ్లెమింగ్ ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి.

సీఎస్‌కే ప్లేఆఫ్స్ అవకాశాలు సజీవంగా ఉండాలంటే తర్వాతి మ్యాచ్‌లో ఖచ్చితంగా గెలవాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే జట్టులో సమతుల్యత కోసం కసరత్తులు జరుగుతున్నాయి. రచిన్ రవీంద్ర లేదా మొయిన్ అలీలలో ఒకరి స్థానంలో బ్రెవిస్‌ను ఆడించే అవకాశం ఉంది. బౌలింగ్ విభాగంలో కూడా తుషార్ దేశ్‌పాండే స్థానంలో కొత్త పేసర్‌ను పరీక్షించే అవకాశం ఉంది."నలుగురు తలలు కలిస్తే వచ్చే ఆలోచన కంటే, ఒక ధోనీ ఆలోచన గొప్పది" అని ఫ్యాన్స్ గట్టిగా నమ్ముతున్నారు. ఆర్సీబీ చేతిలో జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకోవాలన్నా, పాయింట్ల పట్టికలో పైకి ఎగబాకాలన్నా సీఎస్‌కేకు ఈ మార్పులు అత్యవసరం. ధోనీ వ్యూహాలు, బ్రెవిస్ మెరుపులు తోడైతే 'యెల్లో ఆర్మీ' మళ్లీ గర్జించడం ఖాయం.

## నటితో క్రికెటర్ అర్షదీప్ సింగ్ డేటింగ్!




ఐపీఎల్ 2026లో టీమిండియా పేసర్ అర్షదీప్ సింగ్ పంజాబ్ కింగ్స్ జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తున్నాడు. తాజాగా తన వ్యక్తిగత జీవితంతో అర్షదీప్ వార్తల్లో నిలిచాడు. క్రికెటర్ ఒక అమ్మాయి చేయి పట్టుకున్నట్లు కనిపిస్తున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కొంతమంది అభిమానులు చేతిపై టాటూ, గోళ్లపై ఉన్న ఆర్ట్ గుర్తించి, ఆమె మరెవరో కాదు సర్గీన్ కౌర్ అని చెబుతున్నారు. ఇక అది మొదలుకుని అర్షదీప్, సర్గీన్ ప్రేమలో ఉన్నారని ప్రచారం జరుగుతోంది. అర్షదీప్ సింగ్ షేర్ చేసిన ఫోటోలలో తను ఒక అమ్మాయి చేయి పట్టుకున్నాడు. కానీ అందులో ఆమె ముఖం కనిపించడం లేదు. అమ్మాయి చేతిపై చిన్న టాటూ మాత్రం ఉంది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే అభిమానులు ఈ టాటూతో అమ్మాయి ఎవరని గుర్తించారు. ఆమె పంజాబీ నటి సర్గీన్ కౌర్ అని చెబుతున్నారు. క్రికెటర్ ఫోటోలో అమ్మాయి చేతిపై ఉన్న టాటూ, చేతిపై ఉన్న టాటూ ఒకేలా ఉన్నాయని అంటున్నారు. ఆ తర్వాత సర్గీన్ కౌర్ మ్యాచ్‌లు చేసేందుకు స్టేడియానికి రాగా.. ఆ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఆమె స్వయంగా తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లో ఫొటోలు షేర్ చేసింది. ఈ ఐపీఎల్ టైం ఫొటో కాదని, గత ఏడాది తీసిన ఫోటోస్ అని నెటిజన్స్ కామెంట్ చేస్తున్నారు. పంజాబీ సినీ పరిశ్రమలో ఎదుగుతున్న నటి సర్గీన్ కౌర్. ఆమె సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటారు. పలు మ్యూజిక్ వీడియోలలో నటించింది. ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో 4.4 మిలియన్ల ఫాలోవర్లు ఉన్నారు. క్రికెట్ ప్రపంచ కప్ 1983 విజయంపై తీసిన 83 సినిమాలో నటించింది. సర్గీన్ కౌర్ 2021లో జమ్మూ కాశ్మీర్‌లో పుట్టింది. స్టార్ పేసర్ అర్షదీప్ సింగ్ కంటే వయసులో ఒక ఏడాది చిన్న. సోషల్ మీడియాలో ఫొటోలు చూసిన నెటిజన్స్ వీరిద్దరూ టచ్‌లో ఉన్నారని, డేటింగ్ చేస్తున్నారని కామెంట్ చేయడంతో విషయం వైరల్ అయింది. అయితే వారి మధ్య రిలేషన్ గురించి జరుగుతున్న ప్రచారంలో అర్షదీప్, సర్గీన్ కూడా రియాక్ట్ కాలేదు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers,
RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609